


# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

ఆగస్ట్ 2017

సంపుటి : 23 **271** సంచిక : 8




**ఆకలితో అలమటించే ప్రాణి ఉండరాదు! ఆహార కొరతలేని జగత్తుగా విశ్వం వర్ధిల్లాలి!**

# అన్నము పరబ్రహ్మ స్వరూపము

**- అన్నము పెట్టు వారికెన్నటికీ ఆహారపు లోటురాదు! -**

## అర్ధరాత్రి వచ్చిన అతిధికి కూడా అన్నము వండి పెట్టే తల్లి డొక్కా సీతమ్మ వంటివారు లేరు!

గోదావరి అక్విడెక్టు ప్రాంతంలోని పశ్చిమగోదావరి గన్నవరం వద్ద డొక్కా సీతమ్మగారనే నిరతాన్నదాత ఉండేవారు. అన్నార్తులను ఆదరించి భోజనం పెట్టడం ఆమె నిత్యకృత్యం. అర్ధరాత్రి సమయంలో కూడా ఆవిడ చేతిలో లాంతరు పట్టుకుని అక్విడెక్టు వద్దకు వెళ్ళి, అన్నార్తులున్నారాయని చూచి, ఇంటికి తీసుకుని వెళ్ళి వండి భోజనం పెట్టేది. అన్నార్తుల పట్ల ఆవిడకున్నంత జాలి హృదయం మరెవరికీ లేదనే చెప్పాలి. క్షుద్బాధ తీర్చుకున్న ఎంద రెందరో సీతమ్మగారి అన్నదాన నిరతిని ఎంతెంతో గొప్పగా చెప్పుకునేవారు.

ఒకసారి ఒక దొంగ, సీతమ్మగారింట్లో ఎంతో ధనమూ, ధాన్యమూ ఉండి ఉంటుంది దోచుకుందామనెడి ఆశతో వెళ్ళాడు. ఆమె వాణ్ణి అక్కడ కూర్చోబెట్టి అప్పటికప్పుడు అన్నం వండి పెట్టింది. దీపానికి అన్నం చూపిస్తూ, వాణ్ణి తినమన్నది. "ఇలా ఎందుకు చేస్తున్నావ్ అవ్వా" అని వాడు అడిగాడు!

"నాయనా! నీవు దీర్ఘకాలమూ అన్నపానాలకు లోటు లేకుండా ఆరోగ్యంగా జీవించాలని దీపజ్యోతిని ప్రార్థిస్తున్నాను, నాయనా"! అనగానే వాడి హృదయం కదిలిపోయింది. 'దొంగతనానికి వచ్చిన నన్ను ఇలా దీవించావా తల్లీ' - అంటూ ఆమె పాదాలకు నమస్కరించి వెళ్ళాడు.

దొంగను కూడా సన్మార్గవర్తనునిగా చేయగల జాతి మనది తెలుగుజాతి.

దొంగను కూడా సత్యం చెప్పమనిన సత్యబోధక చిత్రాలను నిర్మించిన వారు కూడా మనవారే! ఆనాడు 'సత్యమే జయం' చిత్రాన్ని నిర్మించిన వారూ, నటించినవారూ కూడా తెలుగువారే!

ఆనాటి చలన చిత్రాల ద్వారా దర్శకులు నీతిని బోధించేవారు. ఎన్ని కష్టాలు వచ్చినప్పటికినీ సత్యం తప్పని హరిశ్చంద్రుని కథ తెలుగువారికి శిరోధార్యం! మహాత్మాగాంధీ సహితమూ సత్యహరిశ్చంద్రుని కథ విని ముగ్ధుడయ్యాడు; సత్యం వినా వేరు సన్మార్గం లేదని విశ్వసించాడు. పురాణాలు కూడా సత్యం వినా వేరు ధర్మం లేదని బోధించాయి.

'సత్యం వద ధర్మం చర' అని ఆనాడు అన్నా ధర్మ సత్రాలలోనూ, ధర్మనిలయాల లోనూ బోధించారు. నీవు ధర్మాన్ని ఆచరిస్తే, ధర్మం నిన్ను రక్షిస్తుందనే లిఖిత ఫలకాలను గోడలకు అతికించేవారు.

నిరతమూ సత్యము పలికే పాండవాగ్రజునికి ధర్మరాజు అనే పేరును పెట్టారు. ఆయన నోట వచ్చే ప్రతి మాటలోనూ సత్యం, ధర్మం ఉండేవి. ఒకసారి ఆయనచే అసత్యం పలికించాల్సి వచ్చినపుడు "అశ్వద్ధామ హతః - అని గళమెత్తి పలుకుతూ- కుంజరహః" అని మెల్లిగా చెప్పించారు. అప్పుడు కాని కురుక్షేత్ర సంగ్రామ తీవ్రత సన్నగిల్లలేదు.

**సత్యము ఎవరినోట పలుకబడుతుందో, ధర్మం కూడా వారి వలనే నిలుస్తుంది.**

**సత్యం వద- సత్యం పలుకుము; ధర్మం చర- ధర్మంగా చరించుము అన్నది భరత వర్ష ధర్మము.**

**భరత వర్షే భరతఖండే అని ధర్మ కార్యం ప్రారంభించే ముందు ప్రారంభపదంగా చెప్పుకోబడింది.**

**భరతఖండ ధర్మమే విశ్వధర్మానికి కారణమైంది, విశ్వశాన్తికి మూలాధారమైంది.**

**సర్వజనాస్సుఖినో భవన్తు అంతర్యార్థాన్ని అంతరంగంలో ప్రతిష్టించుకుందాం.**

**శాన్తిరస్తు, సుస్థిరస్తు । సర్వేజనా స్సుఖినోభవన్తు । తదాస్తు**



బుధజన విధేయుడు

- గోటేటి శ్రీరామారావు


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**



# భారతదేశం నా మాతృభూమి

భారతదేశం మనదే కానీ ఫలితం మనకేది - అన్న పాత గీతాన్ని ప్రాతః సంజెవేళల్లో పాడుకున్నప్పుడు మనసెంతో బాధపడుతుంది. సోదర సోదరీత్వభావం ఒక్క భారతదేశంలోనే ఉన్నది.

తురుష్కులు, తెల్లవారు ఎందరెందరో భారత సనాతన గంధ వృక్షాన్ని గొడ్డళ్ళతో నరికివేసారు. అయినా ఈ మహావృక్షం నరికిన వారి గొడ్డళ్ళకు సుగంధములే పూసింది. నరికిన ప్రతీవానికీ తన పొత్తిళ్ళలోనే స్థానమిచ్చింది. ఇదీ భారతదేశం యొక్క మాతృవాత్సల్యం. దుష్టకొడుకులు ఉండవచ్చుగానీ, దుష్టభావంగల తల్లి ఉండదనడానికి భారతదేశ సంస్కృతే సద్హృదయ సాక్ష్యం.

భారతదేశం లేదా నేను పుట్టిన దేశం. ప్రతిజ్ఞలోని మొదటి వాక్యంగా ఉండాలి. ఇక్కడ నా మాతృదేశం అనొచ్చు. కానీ భూమి అనే శబ్దం ఎందుకు వాడరు? మాతృ అనే శబ్ధం ఎవరికైనా సహజంగానే అమ్మను గుర్తు చేస్తుంది. అంటే అమ్మను చూసుకున్నట్లే జన్మభూమి భారతాంబను కూడా చూసుకోవాలని మనకు మనసులో గుర్తు ఉండటానికి మాతృశబ్దాన్ని వాడతారు.

అయితే అమ్మను చూసుకున్నట్లే అంటే ఏమిటి?

అమ్మను ఎలా చూసుకుంటాం? ఎలా చూసుకోవాలి? నవమాసాలు మోసి ప్రాణాలకు తెగించి జన్మనిచ్చి, పాలిచ్చి, అన్నం పెట్టి, ఏళ్ల తరబడి, మనం పెరిగి పెద్దవాళ్లమై, ఎవరి కాళ్లమీద వారు నిలబడే వరకు కాపాడే అమ్మ త్యాగాలను వర్ణించే సత్తా ఏ రచయితకైనా ఎలా ఉండదో, భారతమాత మహిమను వర్ణించటం ఎవరికీ సాధ్యం కాదు. అమ్మ త్యాగాలను కొలిచే సాధనాలు ఈ భూమి మీద లేవు; ఇక ముందు రావు. అదే అమ్మ గొప్పదనం. అమ్మ హృదయం వాత్సల్యభరితం. అందుకే అమ్మను ఎలా చూసుకుంటే ఆమె ఋణం తీరుతుందో, ఎవరికి వారే ఆలోచించుకొని, అలా చూసుకున్నప్పుడు మనిషి జన్మకు సార్థకత కలుగుతుంది.

ఇక భూమి అనే శబ్దాన్ని తెలుసుకుందాం. భూమి మనిషికి ఓరిమిగల మొదటి గురువు. తనను త్రవ్వినా, గుచ్చినా, హింసించినా, తనపై భారాలు, బరువులు పడవేసినా, ఆ తల్లి కోపించదు, భూమిపైన ఉన్న నదులు, పర్వతాలు కూడా మన మంచినే కోరుతాయి. అనేక రకాలైన ఖనిజ సంపద ఆ నేలతల్లి అందిస్తుంది. మనం పెట్టే ఇబ్బందులు భరించటమే కాకుండా, పంటలు పండించి మనుషులు బ్రతకడానికి సహాయపడుతుంది.

భూమి అనే శబ్దం పలికినపుడు, విన్నప్పుడు, వెంటనే గుర్తుకొచ్చేది తల్లి సహనం, క్షమాగుణం, త్యాగం.

మన దేశం పేరు 'భారతదేశం'. భారతదేశంలో 'భా' అనే అక్షరానికి అర్థం 'ప్రకాశం'. ప్రకాశమంటే వెలుతురు. వెలుతురు జ్ఞానానికి సంకేతం. ఏ ప్రదేశమైతే నిరంతరం ప్రకాశంతో, జ్ఞానంతో నిండి ఉంటుందో ఆ ప్రదేశమే 'భారతదేశం'. అణువణువునా జ్ఞాన తరంగాలున్న పవిత్ర ప్రదేశం మన భారతదేశం.

అనిర్వచనీయమైన ఆంతరంగికశక్తి ఏ స్థితికి చేరుకున్నాక మనిషి పొరపాట్లు చెయ్యడో, దుఃఖం అనేది ఉండదో, అంతులేని ఆనందం, సంతృప్తి కలుగుతుందో ఆ స్థితి పరిపూర్ణమైన స్థితి.

అందుకే భారతీయులకు జ్ఞానమంటే ఒక ఆదర్శం. మానవ జన్మ ఔన్నత్యానికి చిహ్నం భారతీయ జ్ఞానం. పుట్టుకతోనే వస్తుంది! వెలుగులో జీవించే అవకాశం, అదృష్టం భారతీయుల స్వంతం. జ్ఞానంతో సాంతమూ శాశ్వతంగా ఆనందించే ప్రదేశం భారతదేశం.

గోదావరిలో కురిసిన ప్రతి వర్షపు చినుకు గోదావరిగా ఎలా మారుతుందో భారతదేశంలో జన్మించిన ప్రతి శిశువు జ్ఞానిగా మారుతుందన్నది నూటికి నూరుపాళ్లు సత్యం. అంతా ఈ మట్టి గొప్పతనమ. అందుకే భారతదేశంలో పుట్టడం కేవలం అదృష్టం. అదృష్టవంతులకు మాత్రమే ఇక్కడ పుట్టే అవకాశం దొరుకుతుందనుకోవచ్చు! అందుకే చూడటానికి చిన్నగా ఉన్నా ఎంతో లోతున్న ప్రతిజ్ఞలోని మహావాక్యం మొదటివాక్యం "భారతదేశం నా మాతృభూమి."

**(జె.వి.ఎస్.కె. పూర్ణచంద్రరావు రచన 'ప్రతిజ్ఞ' ఇది భారతీయుల ఆదర్శం నుండి)**

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై
044 25204046, 26171341

We Provide your comfortable Stay and Tasty Food Hospitality
Bhimas Deluxe Hotel
(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)
34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

# రాష్ట్ర ప్రభుత్వాలు జానపద కళలను ప్రోత్సహించాలి!

ప్రాచీన జానపద కళలు జీవించేటట్లు చేయడానికి ఎందరో కళాకారులు పూర్వుల కళారాధనకు పునః పునః ప్రాణప్రతిష్ఠ చేస్తూనే ఉన్నారు. కానీ వారిని ప్రభుత్వం ప్రోత్సహించడం లేదు, సినిమా వ్యామోహంలో పడ్డ ప్రజలు గుర్తించడం లేదు. కానీ పట్టణవాసనలు పొడసూపని గ్రామాల్లో ప్రజలు వీటిని ఆదరిస్తూన్నారు.

తోలుబొమ్మలాట, వీధి నాటకం, వీధి భజనలు వంటి వాటిని గ్రామ ప్రజలు ఆదరిస్తూనే ఉన్నారు.

ప్రముఖంగా చెప్పుకోదగిన తోలు బొమ్మలాటలో – తెల్ల తెరను ముందుగా కట్టి, వెనుక కాగడ దీపాల వెలుగులో, తోలుతో తయారుచేసిన బొమ్మలాటను తెల్లవార్లూ ప్రదర్శిస్తూనే ఉన్నారు. ఆదరణ తక్కువగా ఉన్నా, కొన్ని కుటుంబాలు వారసత్వపరంగా వచ్చిన కళను ప్రదర్శిస్తు జీవిస్తున్నారు.

వారికి రామాయణ, భారత కథలు బాగా తెలుసు. తరతరాలుగా శ్రవణం ద్వారానే యీ కథలు విని పాత్రౌచితంగా గొంతునందిస్తున్నారు. ఒక్కొక్క తెరవెనుకగల, నటికి, నటునికీ శ్రవణ పూర్వకంగానే కథాగమనం, సంభాషణల చాతుర్యం, మధ్య మధ్య పాటలూ, జుట్టుపోలుగాడు జంటవంటి హాస్య సన్నివేశాన్ని సందర్భోచిత విరామాల్లో ప్రదర్శిస్తూ, జనం దృష్టి తమపై లగ్నమయ్యేట్లు అవిరామంగా శ్రమిస్తున్నారు.

కానీ నాటకాలూ, సినిమాలూ వారి కళా శ్రమకు అంతరాయం కలిగిస్తు న్నప్పటికినీ వారెంత మాత్రం నిస్పృహ చెందడం లేదు.

## తోలు బొమ్మలమే..

దక్షిణాదికి చెందిన నాలుగు రాష్ట్రాల్లోని జానపద కళల్లో తోలుబొమ్మలాట ఒకటి. తమిళనాట దీనిని బొమ్మలాట్టం అనే పేరుతో పిలుస్తారు. ఆంధ్రా, కర్ణాటకల్లో ఇది పూర్తిగా అవసాన దశలో ఉన్నరే. తమిళనాట కూడా ఈ కళకు చేటుకాలం దాపురించింది. కన్యాకుమారి, మదురై, తేని, కంచి జిల్లాలు ఒకప్పుడు ఈ కళకు ఆయువుపట్టుగా అలరారాయి. అయితే నేడు ఈ ప్రాంతాల్లోని తోలు బొమ్మల కళాకారులు దయనీయమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.






తోలుబొమ్మలతో పత్తిరమ్మన్



బొమ్మలతో కళాకారిణి అళగమ్మ

తమిళ జానపద కళలైన గరగాట్టం, తెరుకూతు, విల్లిసై, పురవియాట్టం, కుమ్మియాట్టం, ఒయిలాట్టంలో బొమ్మలాటం (తోలు బొమ్మల ఆట) అత్యంత ప్రాచీనమైనవి. త్రేతాయుగం నుంచి ఈ కళ ఉందని చరిత్రను బట్టి వెల్లడయింది. ఈ కారణం గానే తోలు బొమ్మలాటల్లో ఎక్కువగా రామాయణంలోని ఘట్టాలనే ప్రదర్శిస్తుంటారు. సాంకేతిక పరిజ్ఞానం రాకతో సంప్రదాయక కళలకు గ్రహణం పట్టింది. సినిమాల వల్ల నాటకాలకు, రేడియోల వల్ల పాటకచ్చేరీలకు, టెలివిజన్ వల్ల సినిమాలకు, కాంపాక్టు డిస్కుల వల్ల టీవీలకు గ్రహణం పట్టినట్టే బొమ్మలాట్టం కళకు గ్రహణం పట్టింది. ఒకప్పుడు ప్రజలను ప్రభావితం చేసిన ఈ తోలు బొమ్మలాట కళ అన్ని దక్షిణాది రాష్ట్రాల్లోనూ కొనవూపిరితో కొట్టు మిట్టాడుతోంది. గత 15 సంవత్సరాల వ్యవధిలో రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రాంతం లోనూ ఈ బొమ్మలాట్టం జరగలేదని కన్యాకుమారికి చెందిన యాదవ కళాశాలలో బొమ్మలాట్టం కళపై పరిశోధన చేస్తున్న డి. గోవిందరాజ్ తెలిపారు. తమిళ జానపద సాహిత్యంలో తోలు బొమ్మలాట పేరు తోళ్పావై కూతు కాగా వ్యవహారికంలో దీనిని బొమ్మలాట్టంగా ప్రాచుర్యం లభించింది.

## కళాకారుల ఆవేదన

మేం తయారు చేసుకున్న తోలు బొమ్మలను అమ్ముకొని బతకాల్సి వస్తోందని సెల్వి సెల్లవరాజ్ దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తే, చిన్నప్పటిన్నుంచి ఈ కళ మీద బతికిన నాకు ఈ బొమ్మలను అమ్ముకోవడం ఇష్టం లేక కేవలం వాటిని ఇళ్ల వద్దకు తీసుకుని వెళ్లి చూపుతూ వారు ఇచ్చే రూపాయో, బియ్యమో







తోలు బొమ్మలాట



తోలు బొమ్మలనాడిస్తున్న త్యాగరాజన్

తీసుకొని కాలం వెళ్లదీస్తున్నానంది 80 ఏళ్ల అళగమ్మ. రెండేళ్ల క్రితం ఢిల్లీలోని భారతీయ సాంకేతిక విజ్ఞాన సమాచార శాఖ డైరెక్టర్ మధురైలో నాలుగు రోజుల సదస్సును ఏర్పాటు చేసి తోలు బొమ్మలాట కళకు పూర్వపు వైబవం తెస్తానని చెప్పి వెళ్లారు. కానీ నేటి వరకూ మమ్మల్ని మా కళను పట్టించుకున్న నాధులే కరువయ్యారు అంది 70 ఏళ్ల పత్తిరమ్మనే అవేదనగా. ఈకళ మీద ఆసక్తి, మమకారం చచ్చిపోని త్యాగరాజన్ (65) మాత్రం మదురైలో జరిగే సాంస్కృతిక సభల్లో, పెళ్లిళ్లు, పుట్టిన రోజు వేడుకల్లో తన బృందాన్ని బతికించుకోవడానికి ఈ తోలు బొమ్మలాటలను ప్రదర్శిస్తున్నారు.

### ప్రభుత్వం ఏమంటోంది? ఏమైనా చేస్తుందా?

తోలు బొమ్మలాటను తిరిగి బతికించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కానీ–కేంద్ర జానపద కళావిభాగం కానీ ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని కన్యాకుమారి జిల్లా యాదవ కళాశాల డీన్ పి. ఎస్. నవరాజ్ ధ్వజం ఎత్తారు. పాండిచ్చేరి వర్శిటీలో జానపద కళల విభాగంలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న వేలు శ్రీనివాసన్ సైతం ఇదే రకమైన స్పందనను తెలిపారు. అయితే వేలు ఈ కళను తిరిగి ప్రజల్లోకి తీసుకొని వెళ్ళడానికి ఒక పరిష్కారాన్ని సూచిస్తున్నారు. అదేవిధంగా క్లిష్టమైన, కొరుకుడు పడని వైజ్ఞానిక సాంకేతిక అంశాలను తోలుబొమ్మలాట ద్వారా ప్రదర్శిస్తే, అటు కళకూ – ఇటు ప్రజలకు దీనిపై అవగాహనా, ఆసక్తులు పెరుగుతాయి. తద్వారా ఈ కళను నమ్ముకున్న కళాకారులకు సైతం లబ్ది కలుగుతుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే జానపద కళలకు ఆధునికత సంతరింపచేయడం ద్వారా సదరు కళ కనుమరుగు కాకుండా రక్షించవచ్చని ప్రొఫెసర్ వేలు అంటున్నారు. ఈ మేరకు ఢిల్లీలోని ఎన్‌పీఎస్‌టీసీ విభాగం డైరెక్టర్ మనోజ్‌కుమార్‌కు ఒక ప్రాజెక్టును అందచేశామని వేలు చెప్పారు. అసలు జానపద కళ లంటే తెలియని విద్యార్థులకు సైతం అవంటే ఏమిటో, ఎలా ఉంటాయో తెలియచెప్పినవారమవుమని ఆయన అంటున్నారు. అదేవిధంగా అంటువ్యాధులపై అవగాహన కల్గించేందుకు సైతం బొమ్మలాట్టం కళను సమర్ధవంతంగా ఉపయోగించవచ్చు అంటున్నారు.

ఈ జానపద కళలంటే...

కుమ్మియాట్టం – చప్పట్లతో చేసే సంకీర్తనం లేక గానం

గరగాట్టం – నెత్తిన కుండలుంచుకొని చేసే నృత్యం

పురవియాట్టం – గుర్రం బొమ్మను అలంకరించుకుని చేసే డ్యాన్స్

ఒయిలాట్టం – పురుషులు మాత్రమే చేసే నృత్య కళ

తెరుకూతు – వీధి నాటకాలు విళ్ళిసై – గజ్జెలు కట్టిన విల్లుపై రెండు చిన్న కర్రలతో తడుతూ మెలాజీను సృష్టించే కళ మృగ్యమవుతున్నాయ్. ●


SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*





# రాజకీయ వాసనాసారరహితుడు రాష్ట్రపతి అబ్దుల్ కలామ్!


## రమ్యగుణోపేతుడు! రామేశ్వరంలో పుట్టి ఆసేతు హిమాచల పర్యంత ప్రజల హృదయాల్లో ఇంకా ఇంకా నిలిచి ఉన్నవాడు!

రెండు సంవత్సరాల క్రితం, ఇదే జులై 27న అస్తమించాడు. కానీ రామేశ్వరం ప్రజల హృదయాల్లో ఆయన అస్తమించలేదు. అక్కడి మట్టి కణాల్లో సహితమూ ఆయన జ్ఞాపకాలు నిక్షిప్తమై ఉన్నాయ్. ఎందరో మహాత్ములు జన్మించిన అక్టోబరు లోనే కలామ్ జన్మించాడు.

నెల మధ్యం 15వ తేదీ, సాగర మధ్యం రామేశ్వరం దీవి, ఆ దీవినందు జన్మించిన దివ్యజ్ఞుడే అబ్దుల్‌కలామ్! అబ్బురమైన! రామ్ రహీమ్ ఏక్‌హై అన్నది అబ్దుల్ కలామ్ జీవితమే నిండు నిదర్శనం !

భూమధ్యరేఖలా ఉండే ఆ పాపిడి మధ్యరేఖ ఆ రేఖకు రెండువైపులా వెండికొండ వెలుగు రేఖల్లా మెరిసే కేశములూ, నిరంతరమూ, నిర్విరామంగా వెలుగొందే సూర్యచంద్రుల కాన్తులు ఒకేసారి చూస్తున్న సంగమమై వెల్తురు రేఖలను విరజిమ్మిపోస్తున్నాయా- అన్నట్లున్నది.

ఎందరో మహనీయులు అక్టోబర్‌లో జన్మించినట్లు, కలాం అక్టోబర్ మధ్య 15వ తేదీన, సాగర మధ్య రామేశ్వరం దీవిలో పుట్టడమే అందుకు కారణమై ఉండవచ్చు. ఈ దీవిలోని రామేశ్వరుని సాన్నిధ్యంలో పుట్టినవాడు హిమవత్పర్వత సమీపంలో ఈశ్వరసాన్నిధ్యం చెందాడు. ఎంతమందికి దక్కుతుందీ అదృష్టం.






# తెలుగు పౌరాణిక నాటక రంగానికి పునర్వైభవం కూరుస్తున్న నవరసనటుడు

# గుమ్మడి గోపాలకృష్ణ

తాను పౌరాణిక, ఐతిహాసిక పాత్రలను పోషించడమే గాకుండా– తనలా ఎందరో నటుల్ని తయారుచేస్తున్న నాటకరంగ నట యశోవిశాలుడు!

అమెరికాలో కూడా ఎంతో మంది ఔత్సాహికుల్ని, పౌరాణిక నటులుగా తీర్చిన ప్రతిభావంతుడు. పద్మశ్రీ, పద్మభూషణ్ బిరుదులకు అర్హుడు.

పద్యనాటకం బూజు దులిపినవాడు!

ఆ బూజును దులిపి, పద్య నాటకానికి పూర్వపు ప్రతిభను తెస్తున్నవాడు గుమ్మడి గోపాల కృష్ణమూర్తి!

మూర్తి అతని పేరులో ఉన్నదో, లేదో కాని, కృష్ణపాత్రకు మూర్తిత్వం కల్పిస్తున్న వాడు గుమ్మడి గోపాలకృష్ణ ।

కృష్ణపాత్రను నవరసభరితంగా తీర్చిదిద్దినవారు తిరుపతి వేంకటకవులు. వారి 'పాండవోద్యోగ విజయం' నాటక ప్రదర్శన అసాధారణమైనది. మూడువందల పద్యాలతో ఆరుగంటలపాటు ఆ నాటకాన్ని ప్రదర్శించేవారు. తరువాత కాలవేగాన్ని గణనలోకి తెచ్చి మూడు గంటలకు కుదించివేసారు. పద్యపౌరాణిక నాటకాల్లో పట్టాభిషిక్తురాలై స్వర్ణ సింహాసనంపై అదిష్ఠురాలైనది 'పాండవోద్యోగ విజయం' నాటకం. ఆ నాటకాన్ని చూడడానికి పట్టణ నగరాలకు ఎడ్లబళ్ళను కట్టుకుని జనం వచ్చేవారు. గ్రామగ్రామాల్లో కూడా ఆ నాటకం ప్రదర్శితమవుతుండేది. అప్పటి ప్రేక్షకులు ఆ నాటకంలోని 300 పద్యాలనూ లెక్కగట్టి వినేవారు. అందుకే ఆ నాటకంలో కృష్ణ పాత్రను ముగ్గురూ, అర్జున పాత్రను ముగ్గురూ, ధర్మరాజు పాత్రను ఇద్దరూ పోషించి, తిరుపతి వేంకట కవుల పద్యాలను రాగయుక్తంగా పాడేవారు. లేకపోతే నాటకం రక్తికట్టేది కాదు.

పాండవోద్యోగ విజయం విజయానికి పద్యాలే ప్రధాన కారణం.

పద్య నాటకం తెలుగువారి సొత్తు. వేరుగా ఏ భాషలోనూ పద్యమన్నది లేదు. ఆ పద్యానికి ప్రాణం పోసినది తెలుగు నాటకమే.

ముఖ్యంగా తిరుపతి వేంకట కవుల పాండవోద్యోగ విజయం, చిలకమర్తి లక్ష్మీనరసింహారావు గారి 'గయోపాఖ్యానం' నాటకాలు పద్యనాటకాల్లో ప్రసిద్ధిగన్నవి. లలిత విలసితమైన గ్రాంధిక భాషయైననూ పాడేవారు, వినేవారూ, పరవశించేవారు, వన్స్‌మోర్– అని ప్రేక్షకులు అనగానే మరో పర్యాయం ఆ పద్యాన్ని పాడే సాంప్రదాయం ఆనాడు ఉండేది, ఇప్పుడూ ఉంది, పాడి పరవశింపచేసేనటులే లేరు– అని నిస్పృహ చెందుతున్న సమయంలో గుమ్మడి గోపాలకృష్ణ నా కంట పడ్డాడు. అతడి పద్యాలాపనం వింటుంటే ఆనాటి అబ్బూరి, రఘురామయ్య, కర్రి అబ్బులూ నా కంటికగుపించినట్లుగా ఉండేవారు. బందా కనకలింగేశ్వరావు గారు పదములను విడగొట్టి పాడేవారు, పీసపాటి నరసింహమూర్తి గారిది మరో బాణి. కానీ గుమ్మడి గోపాలకృష్ణ ఆయా బాణీలు పుణికి పుచ్చుకున్నప్పటికినీ, ఒకొత్తరకమైన సొగసును వర్షిస్తూ, హర్షింపచేస్తున్నాడు. పద్యానికే గాకుండా, పద్య శ్రోతలకూ ఓ కొత్త గుభాలింపు సొగసులనద్దిస్తూ ఎంత ఎంత హాయిగా వీనులకు విందుచే కూరుస్తున్నాడన్నది అక్షరబద్ధం చేయలేను.

కృష్ణాజిల్లా బందరు ప్రాంతంవాడేమో, చక్కటి తొక్కుడు నేతి లడ్డూల్లా వీనులకుండే జిహ్వలను హాయిహాయిగా, ఆమని కోయిల వసంతంలో వసంతరాగం పాడినట్లు పరవశింపచేస్తాడు.

కృష్ణ పాత్రనందునే గాకుండా, శ్రీనాధుని పాత్రనందునూ, వేమన పాత్రనందు కూడా వింత సోయగాలు విందు కూర్చాడు. పద్య నాటక పునర్వైభవానికి నిరంతర కృషి చేస్తున్న నవరస నాటక సార్వభౌముడని ప్రస్తుతిస్తు ఆశీర్వదిస్తున్నాను.



# ఏడూ కొండలస్వామి ఎక్కడున్నావయ్యా! ఎన్ని మెట్లెక్కినా అగుపడా వేమయ్యా!

**నీ** పాదశిఖరం ఎక్కినా, కనిపించవేమయ్యా!

**భూలోకంలో ఉన్న వారికే కాదు, ముల్లోకములలోని వారికీ వేంకటేశ్వరుడే కొండంత దేవుడు!**

హైరాన పడుతూ ఏడుకొండల మెట్లెక్కుతూ వెళ్ళినా, కారుల్లో బస్సుల్లో సైరన్ మోతపెట్టుకుంటూ వెళ్లినా, ఆయన అత్యవసర దర్శనం యివ్వడు! కొండంత ఆ దేవునికి కొండంత పరిణామంలో పూలూ, పండ్లూ యిచ్చినా అనుగ్రహించడు.

ఏడుకొండలవాడా, యెక్కడున్నావయ్యా- అని ఆర్తితో కొలవాలి. ఏడుకొండల వాడా- యని ఎలుగెత్తి పిలవాలి. **గోవింద గోవింద** అంటూ నామస్మరణ చేయాలి. స్వరపీఠిక ఆ నామస్మరణ నుంచీ రావాలి.

గోవింద గోవింద అంటూ, స్మరిస్తూ ఏడు ద్వారాలు దాటివెడితే, నామాం పట్టీలో కర్పూర కస్తూరీ తిలకం మధ్య భృగిటి నుంచీ ఆయన మనల్ని చూస్తాడు. మనం ఆయన్ను చూడడం కాదు, ఆయన మనల్ని చూడాలి. తదీర్ఘ భక్తితో గోవిందనామ తన్మయత్వంతో వెళ్ళేవారిని ఆయన తప్పక చూస్తాడు. అనుగ్రహిస్తాడు. ఇటీవలే ఓ మూగ బాలుడు తల్లీ తండ్రులతో క్యూలో వెడుతూ, గోవిందా! గోవింద గోవింద! గోవిందా- అని పలికి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. ఇలాంటి ఒక అనుభవం నేనూ పొందాను.

1956 సం॥ము వరకూ ఆలయం క్యూలో కనురెప్పమూయకుండా, గళం యుగళంగా గోవింద గోవింద అంటూనే తృప్తిగా దర్శించే భాగ్యం కలిగింది. కళ్ళముందే ఆ కరుణాంతరంగుడు కనులు విపార్చి చూచిన అనుభూతి కలిగింది. పద పద అనే వాటంటీర్ల తోపులాట ఉండేది కాదు. తర్వాత తర్వాత భక్తుల ఆర్తిని చూచి ఆయన కనురెప్పలు తెరిచి చూచిన అనుభూతిని కల్గిస్తూ వచ్చాడు. ఏడు కొండలవాడ ఎక్కడున్నావయ్యా- ఎన్ని మెట్లెక్కి వచ్చాను కనిపించవేమయ్యా అంటూండగానే నీ ముందే ఉన్నాను- అనే భరోసా యిస్తూ, అభీష్టములను సిద్ధింపచేసే ఏడేడు లోకాల ఏడుకొండల ఱేడు సద్దర్శనమిస్తూనే ఉన్నాడు. ఆయన అవిశ్రాంత అనుగ్రహాన్ని చూచి- ఓ యమ్మ ఓ సినిమాలో- **సద్దుసేయక నీవు నిదురపోవయ్యా!**

**పాలసంద్రపుటలల పట్టె మంచముగా, పున్నమి వెన్నెలలు పూలపాన్పుగా, అన్నీ అమరించే నీ అలిమేలుమంగా - సద్దుసేయక నీవు నిదురపోవయ్యా** - అన్న పదం నాలో పదేపదే కుసుమిస్తూనే ఉంది- ఇది నిజమేమో - రాత్రి 12 గం॥లకే పవ్వళింపు సేవజరిపి, తెల్లవారక ముందే 2 గంటలకే **కౌసల్యాసుప్రజారామా పూర్వా సంధ్యా ప్రవర్తతే** మేలు కొలుపు పాడి భక్తుల రద్దీని పురస్కరించుకుని మేలు కొలుపుతున్నారు. నిదుర ఎరుగని స్వామి ఆయన ఒక్కడే! భక్తుల పాలిట కల్పతరువు. ఆయన తనువు నిదురెరుగదు! కాబట్టి, ఆయన కళ్ళెప్పుడూ తెరుచుకునే ఉంటాయ్.

త్యాగరాజుల వారొక పర్యాయం తిరుమల వెళ్ళినప్పుడు, స్వామిని నిదురపుచ్చి తెరవేసారు :

”తెరతీయగరావా స్వామీ, నాలోని మత్సరమను తెరతీయగారాదా - అని ఆలపించే సరికి- ఆ స్వామి తెరతీసి త్యాగరాజులవారికి దర్శనమిచ్చారు.

అలాటి స్వామి ఎక్కడున్నావయ్యా- అంటే ఏడుకొండలపైనే ఉన్నాడు. తిరుచానూరులో ఉన్న సతి పద్మావతి దేవిని ఎప్పుడు చూస్తాడనే సందేహం కలిగి, ఓ కవి - 'నడిరేయి ఏ జామునో స్వామి తిరుమల, శిఖరాలు దిగి వచ్చునో' అనే ఆర్ద్రతతో కీర్తన వ్రాసాడు:

ఏడు కొండలవాడు ఎందులేడు ? ఎందెందు వెదికినా అందే ఉన్నాడంటూ సమాధానపడతాడు.





మధురస్మృతి

# వెండితెర వెలుగుగా విలసిల్లిన బంగారుతల్లి సావిత్రి!

'ఆలయాన వెలసిన ఆ దేవుని రీతి... ఇల్లాలే ఈ జగతికి జీవన జ్యోతి' పాట విన్పించగానే తెలుగు ప్రేక్షకుల మదిలో మెదిలే నిండైన (సౌందర్యరూపం). సావిత్రి, 'మహానటి' అన్న పేరును 'నూటికి నూరుపాళ్లు' సార్ధకతను చేకూర్చి వెండితెరకే గర్వకారణమైంది. 318 చిత్రాల్లో నటించి చిరస్మరణీయురాలైంది.

గుంటూరు జిల్లా తాడేపల్లి మండలంలోని చిర్రావూరు గ్రామంలో నిశ్శంకర గురవయ్య, సుభద్రమ్మ దంపతులకు 1936 జనవరి 4వ తేదీన సావిత్రి జన్మించింది. (అభిమానులు మాత్రం సావిత్రి జన్మదినాన్ని డిసెంబరు 6 గా జరుపుకుంటున్నారు) సావిత్రి 6 నెలల ప్రాయంలో ఉండగానే టైఫాయిడ్‌తో తండ్రి గురవయ్య మృతి చెందగా, విజయవాడలోని సోదరి దుర్గాంబ నివాసానికి సుభద్రమ్మ మకాం మార్చింది. వరుసకు పెద్దమ్మ, పెదనాన్న దుర్గాంబ, వెంకట్రామయ్యచౌదరి ఇంటికి తల్లితోపాటు చెల్లెళ్ళయిన మారుతి, సావిత్రి వెళ్ళారు. బెజవాడ కస్తూరిబాయి మెమోరియల్ స్కూలులో చదువుకుంటూ రోజూ వెళ్లే దారిలో నృత్య విద్యపట్ల మక్కువ చూపిన సావిత్రి శిష్టా పూర్ణయ్యశాస్త్రి వద్ద సంగీతం, శాస్త్రీయ శిక్షణ తీసుకుంది. బాల్యంలో బెజవాడలో ప్రదర్శనలిచ్చి ప్రశంసపత్రాలు, మెమెంటోలు అందుకున్నది. ఆ తరుణంలో కొంతకాలం ఎన్టీఆర్, కొంగర జగ్గయ్య నిర్వహిస్తున్న నాటకాల కంపెనీలో సావిత్రి నటించింది. పెదనాన్న వెంకట్రామయ్యచౌదంరి నడిపిన నాటకాల కంపెనీలో నటించింది. బుచ్చిబాబు రాసిన ఆత్మవంచన నాటకంలో నటించి మెప్పుపొందింది. వెంటనే సినిమారంగంపై దృష్టి సారించింది. ఎన్నో ఒడిదుడుకులు, కష్టాలను మొండిధైర్యంతో ఎదుర్కొని 'అభినేత్రి'గా విరాజిల్లింది. ఎల్వీ ప్రసాద్ దర్శకత్వంలో 'సంసారం' సినిమాలో చిన్న పాత్ర ధరించినప్పటికీ వయసు సరిపోవకపోవటంతో నటించటానికి దూరమైంది. అనంతరం కె.వి.రెడ్డి దర్శకత్వం వహించిన 'పాతాళభైరవి'లో సాధారణ పాత్రలో నటించింది. 'పెళ్ళిచేసిచూడు' చిత్రంతో ఆమె నటనా కౌసల్యం ఓ మలుపు తిప్పింది. అయితే ఆ చిత్రంలో రెండో కథానాయిక పాత్ర అయినప్పటికీ అది ఆమె నటజీవితానికి 'పునాదిరాయి'గా మారింది.

నృత్యదర్శకుడు, వేదాంతం రాఘవయ్య దర్శకత్వంలో 'దేవదాసు' వరకు బ్రేకుపడింది. ఎల్వీ ప్రసాద్ దర్శకత్వంలో 'మిస్సమ్మ'లో ప్రధాన పాత్రతో తెలుగు చిత్రపరిశ్రమలో అగ్రకథానాయిక స్థానం పటిష్టం చేసుకుంది.

'దొంగరాముడు', 'చరణదాసి', 'అర్ధాంగి' చిత్రాలు ప్రేక్షకులకు గుర్తిండిపోయే నటిగా కీర్తితెచ్చి పెట్టాయి. 1957లో 'మాయాబజార్' ఆమె అసమాన నటనా వైదుష్యం కీర్తిపతాకంలో కలికితురాయి అని చెప్పాలి. తమిళభాషలో నటించిన వారిచే 'నడిగెయర్ తిలగం' పొందింది.

1968లో 'చిన్నారి పాపలు' సినిమాకు దర్శకత్వ బాధ్యతలు చేపట్టి 'దక్షిణ భారతదేశంలోనే తొలి మహిళా దర్శకురాలు కీర్తిని సంపాదించింది. 'వింత సంసారం', 'చిరంజీవి', 'మాతృదేవత' సినిమాలకు దర్శకత్వం వహించింది. 1956లో తమిళ నటుడు జెమినీగణేశన్‌తో వివాహం, విజయఛాముండేశ్వరి, సతీష్‌కుమారులకు జన్మనివ్వటం, కుటుంబ కలహాలు, ఆస్తులు కోల్పోవటం వంటి ఎన్నో కష్టాలను చవిచూసి 1981 డిసెంబరు 26న 'మహానటి' కన్నుమూసింది.

ధానధర్మాల్లో సావిత్రిది 'ఎముకలేని చేయి'. ఆమెది ఎడమచేతి వాటం. వాస్తవంగా బహుచమత్కారి అయిన సావిత్రి సహనటులు రేలంగి, సరోజాదేవి, ఎస్వీ రంగారావు తదితరులను అనుకరించేది. దానధర్మాలో 'ఎముకలేని చేయి'. ఒకసారి, నిండుగా నగలను అలంరించుకుని అప్పటి ప్రధాని లాల్‌బహుదూర్‌శాస్త్రిని కలిసేందుకు వెళ్ళి, కాసేపు మాట్లాడాక, ఒంటిపై ఉన్న నగలను ప్రధానమంత్రి సహాయనిధికి దానం చేసి ఔదార్యాన్ని చాటుకుంది.

1968, 69,71 కాలంలో 'చిన్నారి పాపలు', 'కుళందుఉళ్ళం', 'మాతృదేవత', 'చిరంజీవి', 'వింతసంసారం', 'ప్రాప్తం' చిత్రాలకు దర్శకత్వం వహించింది. 'నవరాత్రి' సినిమాకు నేపథ్య గాయనిగా తన గళాన్ని అందించింది.

గుంటూరుజిల్లా రేపల్లె మండలంలోని వడ్డివారిపాలెంలో విద్యాభివృద్ధికి అవసరమైన నిధులు అందజేయటంతో ఆమె పేరుతో ఉన్నత పాఠశాల ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఏటా ఆమె జయంతి రోజున 'మహానటి'ని గుర్తుచేసుకుంటూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆనవాయితీగా చేస్తున్నారు.

**జననం 1936 జనవరి 4, మరణం 1981 డిసెంబర్ 26**



**దత్తాత్రేయుడు- త్రిమూర్తుల అంశ. గురువులకే మహాగురువు. దత్త సంప్రదాయంలో పిఠాపురానికి ప్రత్యేక స్థానం ఉంది.**

**దత్తుడి తొలి అవతారమైన శ్రీపాద శ్రీవల్లభుడు నడయాడిన ప్రాంతం పిఠాపురం. కాబట్టే, దత్తజయంతి ప్రధానంగా పిఠాపురంలో జరపాలి!**

జటాధరం పాండురంగం
శూలహస్తం కృపానిధిం
సర్వరోగహరం దేవం
దత్తాత్రేయమహం భజే

తూర్పు గోదావరి జిల్లాలోని పిఠాపురాన్ని పీఠికా పురమని పిలిచేవారు.

దేశంలోని త్రిగయల్లో... పిఠాపురం పాదగయ. ఇక్కడే కుక్కుటేశ్వరస్వామి ఆలయం ఉంది. గయాసురుడనే రాక్షసుడని సంహరించడానికి శివుడు కోడిరూపం ధరించడం వలన స్వామికి ఆ పేరు వచ్చింది.

ఆదిశంకరుడు ప్రతిష్ఠించిన రాజరాజేశ్వరీదేవి ఆలయమూ ఇక్కడే ఉంది. వీటన్నిటికి తోడుగా... పిఠాపురం సుప్రసిద్ధ దత్తక్షేత్రం.

దత్తాత్రేయుడి తొలి అవతారమైన శ్రీపాద వల్లభుడు నడయాడిన నేల. శ్రీపాదవల్లభ క్షేత్రం భక్తజనులతో నిరతమూ కళకళలాడుతూ ఉంటుంది.

కుక్కుటేశ్వర ఆలయ ఆవరణలో ఔదుంబర వృక్షం ఉన్న మేడిచెట్టు మహిమాన్వితమని భావిస్తారు. చెట్టు మొదట ఉన్న పాదుకలు శ్రీపాదవల్లభుల వారివే అని భక్తుల ప్రగాఢ నమ్మకం.

శ్రీపాద వల్లభుడి జన్మవృత్తాంతం తెలిపే ఐతిహ్యమిది.

పూర్వం పిఠాపురంలో సుమతి, అప్పలరాజుశర్మ అనే దంపతులు ఉండేవారు. దత్తుడి పరమభక్తులు వారు. జన్మజన్మలుగా దత్తాత్రేయుడినే సేవించేవారు. ప్రతి జన్మలోనూ వారికి స్వామి దర్శనం ఇచ్చేవాడు. అయినా ఒక్కవరమూ కోరుకోలేదు. దత్త దర్శనమే మహద్భాగ్యమనుకున్నారు. పిఠాపురంలో స్వయంభువై వెలసిన దత్తుడు వారి ఇంటికి వెళ్లి నిత్యం భిక్ష స్వీక రించేవాడు. ఓ సందర్భంలో సుమతి కోరికను మన్నించి... దత్తాత్రేయుడి తొలి అవతారమైన శ్రీపాదవల్లభుడి రూపం ఎలా ఉంటుందో కళ్లకు చూపించాడు. 'ఆహా! కంటే ఇలాంటి బిడ్డనే కనాలి!' అనుకుందా ఇల్లాలు. ఆమె కోరికను మన్నించి... సుమతమ్మ గర్భంలో జన్మించాడు దత్తుడు. స్వామి పిఠాపురంలోనే జన్మించడం వెనుక ఓ వృత్తాంతం ఉంది. భరద్వాజ మహర్షి ఇక్కడో యజ్ఞం చేశాడు. ఆ ఫలాన్ని దత్తాత్రేయుడికి ఇస్తూ... 'మహానుభావా! ఇక్కడ జన్మించి ఈ నేలను చరితార్థం చేయమని వేడుకున్నాడు. అలా పుణ్యదంపతుల కోరిక తీర్చడానికీ, మహర్షికిచ్చిన మాట నిలబెట్టుకోడానికీ దత్తాత్రేయుడు శ్రీపాద వల్లభుడిగా పిఠాపురంలో జన్మించాడు. ఆరో ఏట, ఉపనయనం అయిన మరుక్షణమే చతుర్వేదాలు గడగడా అప్పుజెప్పడం, పదహారో యేట, తన అవతార లక్ష్యాన్ని తల్లికి వివరించి, సన్యాస దీక్ష స్వీకరించి, దత్త ధర్మ ప్రచారానికి బయల్దేరాడు. అటునుంచి అనేక ప్రాంతాల్లో సంచరించి మహబూబ్‌నగర్ జిల్లాలోని కురుపురానికి చేరుకున్నాడు. ఇక్కడి భక్తకోటికి అనేక మహిమలు చూపాడు.



**శ్రీ పాదవల్లభుడే దత్తాత్రేయుడు!**

**షిర్డీసాయిబాబాను దత్తాత్రేయునిగా కొలిచే వారెందరో!**
**షిర్డీని దర్శించేవారిలో సగానికి మించిన భక్తులు తెలుగువారే!**
**దత్తుని తొలి అవతారం పిఠాపురంలోనే వెలిసింది!**
**దత్త సాంప్రదాయ ఆవిర్భావం ఆంధ్రదేశంలోనే ఆవిర్భవించింది!**
**ప్రతీ దత్తభక్తుడూ దర్శించదగిన క్షేత్రం పిఠాపురం నేను దర్శించి కృతార్థుడనయ్యాను.**


దత్త జయంతి సందర్భంగా పిఠాపురంలోని శ్రీపాద వల్లభ సన్నిధిలో దత్తమాలలు వేసుకుని... అర్ధమండల, సప్తాహదీక్షలు పాటించేవారెంతో మంది ఉన్నారు. అటు పిఠాపురంలోనూ, ఇటు కురుపురంలోనూ ఆ రోజు ప్రత్యేక పూజలు జరుగుతుంటాయి. శ్రీపాద శ్రీవల్లభుడితో పాటూ శ్రీ నరసింహ సరస్వతి స్వామి (మహారాష్ట్ర), శ్రీ మాణిక్య ప్రభుమహరాజ్ (గుల్బర్గా), అక్కల్‌కోట మహరాజ్ (అక్కల్), షిరిడీసాయి (షిర్డీ)... దత్తుని అవతారాలని భక్తుల విశ్వాసం.

### *దత్తాత్రేయ జననం...*

అత్రి మహర్షి, అనసూయదేవి – ఆదర్శదంపతులుగా ముల్లోకాల్లోనూ ప్రసిద్ధిగన్నారు. నారదుడు గులకరాళ్ల మూటతో ఆకాశ మార్గంలో వెళ్తుండగా... లక్ష్మి, సరస్వతి, పార్వతి ఎదురుపడ్డారు. ఆ మూటను చూసి... 'ఎవరికీ గెలకరాళ్లు నారదా!' అని ప్రశ్నించారు. భూలోకంలో ఉన్న అనసూయ కోసమని చెప్పాడు. ఆమె రాళ్లను అన్నంలా మార్చగల మహాపతివ్రత అని మెచ్చుకున్నాడు. ఎంత వారు దేవతలైనా ముగ్గురమ్మలకూ అహం ఉంటుందిగా! ఆమె 'మాకంటే పతివ్రతా?' అంటూ అనసూయను పరీక్షించడానికి త్రిమూర్తులను భిక్షువుల రూపంలో భూలోకానికి పంపారు. ఆ సాధ్వి అతిథుల్ని సాదరంగా ఆహ్వానించింది. వారు 'అనసూయాదేవి! నువ్వు వివస్త్రగా మాకు వడ్డన చేయాలి' అన్న షరతు విధించారు. దీంతో ఆమె... ఆ సృష్టిపాలకుల్ని పసిబిడ్డల్ని చేసింది. గోముచేసి గోరుముద్దలు తినిపించింది. జోలపాడి నిద్రపుచ్చింది. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు పసివాళ్లయి పోవడంతో... ముగ్గురమ్మలకూ ఏం చెయ్యాలో పాలోపోలేదు. నారదుడి సలహా ప్రకారం అనసూయాదేవిని క్షమాపణ కోరారు. త్రిమూర్తులకు మునుపటి రూపం వచ్చింది. అనసూయ భక్తికి మెచ్చి... తమ అంశతో ఓ బిడ్డను ప్రసాదించారు.

మార్గశిర పౌర్ణమినాడు దత్తాత్రేయుడు ఆ తల్లి కడుపున జన్మించాడు. ప్రతీ భక్తడూ దర్శించదగిన క్షేత్రం పీఠికీ (పిఠా) పురం.

– కృతజ్ఞతలు **పి. రమేష్,** న్యూస్‌టుడే, పిఠాపురం

భగవంతునికి భక్తునికి
అనుసంధానమైనది


అంబికా దర్బార్‌బత్తి



# గాయత్రీ మంత్ర ద్రష్ట విశ్వామిత్రుడు!

## విశ్వాభ్యున్నతికి గాయత్రీ మంత్రోపదేశం చేసిన మహర్షి!

**యాగరక్షణా నిమిత్తార్ధమిషగా రామలక్ష్మణులను మిథిలకు తోడ్కొని వెళ్ళి సీతారాములకూ ఊర్మిలాలక్ష్మణులకూ వివాహం జరిపించిన మహర్షి.**

**లోక కల్యాణార్థమై సీతారాముల కల్యాణ కారకుడూ విశ్వామిత్రుడే!**

సీతారామ లక్ష్మణుల వివాహంగాకుంటే ఇటు దక్షిణమునున్న లంకకూ, అటు ఉత్తరమునున్న మిథిలకూ సన్నిహితత్వం ఏర్పడేది కాదు. హనుమ సుగ్రీవుల మైత్రీ విభీషణుని కారణంగా లంక గుట్టు తెలిసేది కాదు, రావణ సంహారం జరిగేది కాదు. దండకారణ్యంలోని వేలాది  రాక్షసులు సంహరింపబడేవారు కాదు. సర్వహితమూ, సర్వోత్తమమైన గాయత్రీ మంత్రం భరతవర్షానికి ప్రాప్తించేది కాదు.

### సమాజ శ్రేయస్సే గాయత్రీ మంత్రం!

వేదాలు లోకాసమస్త సుఖినోభవంతు అని ఘోషిస్తున్న విశ్వశ్రేయస్సుకు, సమసమాజ స్థాపనకు గాయత్రీమంత్రం దోహదకారి. ఒక జీవన దర్శనం. ఒక జీవించే కళ. శాస్త్రం. అవి ఒక ఆలోచనా విధానం. జీవన సరళి, సమాజ నిర్మాణానికి, విశ్వశాంతికి మూల మంత్రం. ఒక దివ్యజ్ఞానం గల గాయత్రీమంత్రం గాయత్రి దేవమాత. గాయత్రీ ఉపాసన వల్ల మనిషి మహా మనీషుడుగా మారతాడు. గాయత్రిలోని 24 అక్షరాలతో నిండి ఉంది. నీతి, ధర్మం, పవిత్ర జీవితం, కళ, సామాజిక వ్యవహారాలను గురించిన బోధ. మనిషి ఆలోచనలనూ, భావాలనూ, లక్ష్యాన్నీ, దృక్పథాన్నీ క్షాళన చేసి శారీరక, మానసిక క్రియలలో సత్వగుణమూ, ధర్మ నిష్ఠా పెంపొందుతాయి. గాయత్రిలోని అక్షరాలు చేసే మహాబోధలను అనుసరిస్తే ఈ ప్రక్రియ అమలు జరుగుతుంది. కనుకనే గాయత్రి వేద శాస్త్రాల సారం.

### ఓం

ప్రకృతి అంతరాళంలో 'ఓం' వంటి ధ్వని ప్రతిక్షణం ఉత్పన్నం అవుతోంది. ఈ పరమేశ్వర నామాన్ని సూక్ష్మ ప్రకృతి ప్రతి క్షణం జపిస్తోంది.  నినదిస్తోంది. కనుక ఈ నామం, స్వయం వ్యక్తం, సర్వశ్రేష్ఠం అయినది. సత్వగుణాన్నీ, దైవీయ, ఈశ్వరీయ పారమార్థిక భావనలనూ హృదయంలో నింపుకోవడం. తామసంతో, అసురత్వంతో, భోగవాదంతో, స్వార్థంతో కూడిన వాసనలలో మునిగిపోవడం  ఉండదు.

ఓంలో అ ఉ మ్ అనే మూడు అక్షరాలు కలసి ఉన్నాయి. 'అ' అంటే ఆత్మపరాయణత్వం; మనస్సును శారీరిక విషయాల నుండి తప్పించి, ఆత్మానందంలో ఓలలాడడం. 'ఉ' అంటే ఉన్నతి. శారీరిక, మానసిక, సామాజిక, ఆర్థిక, ఆత్మిక సంపదలతో మనల్ని నింపుకోవడం. 'మ్' అంటే అర్థం– గొప్పతనం, క్షుద్రతనూ, సంకుచితత్వాన్నీ, స్వార్థపరత్వాన్నీ, ఇంద్రియ చాపల్యాన్నీ వదులుకోవడం ప్రేమ, దయ, ఉదారత, సేవ, త్యాగం, ఆదర్శాలు, సంయమనం ఆధారంగా జీవితాన్ని నిర్మించుకోవడం.

### భూః

మనం శరీరాలం కాము–ప్రాణ మూలం, ఆత్మలం. శరీరానికి ప్రధాన్యాన్ని ఇస్తూ ఆత్మను ఉపేక్షించడం భౌతిక వాదం. మనం ఆత్మలమనీ, కనుక మన శ్రేయస్సు ఆత్మపరాయణత్వంలో ఉన్నదనీ గాయత్రి చెబుతుంది. మనం ఆత్మవాదులం కావాలి. ఆత్మ కల్యాణానికీ, ఆత్మచింతనకూ, అత్యోన్నతకీ, ఆత్మగౌరవానికీ అగ్రప్రాధానయం ఇవ్వాలి. వాటికోసం కృషిచేయాలి. సమాజ సేవద్వారా విరాట్ పురుషుడూ, విశ్వమానవుడూ అయిన పరమాత్మను ఆరాధించాలి.

భువః అక్షరం మనకు కర్మయోగ సందేశాన్ని ఇస్తోంది. కర్మయోగం ఆధారంగానే మనం అన్ని రకాల దుఃఖాలనుండీ విడుదల పొందగలుగుతాం. సత్ఫలితాలను సాధించాలంటే మన జీవనం వికాసం పొందాలంటే చేయవలసిన పనిలో మనం పూర్తిగాద నిమగ్నం కావాలి. ఇలా నిర్ణయించుకోవడంలోనే బుద్ధికుశలత, దూర దృష్టి వివేకం ఇమిడి ఉన్నాయి. మనం మన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ ఉన్నప్పుడు వైఫల్యానికి క్రుంగిపోవడంలో, సాఫల్యానికి పొంగిపోవడంలో అర్థం లేదు. ఫలితాన్ని ఇచ్చేశక్తి వేరొకటి. మనం మన కర్తవ్యాన్ని పూర్తిచేయాలి. ఈ భావనయే అనాసక్త యోగం. ఈ దృక్పథం కలిగిన వ్యక్తి ఎల్లప్పుడూ సంతోషంగా ఉంటాడు. దుఃఖంలో కష్టంలో విచారించవలసిందేమీ  అతడికి కనిపించదు.

స్వః మనస్సును నీలోపల స్థిరంగా ఉంచుకో. నీవు దృఢమైన మనస్సుతో వుండు. సంఘటలనూ, పరిస్థితులనూ నీటి అలలుగా పరిగణించు. వాటితో

*Compliments from*

**Sri Krishna Bhat**

*When you come to*
*Holy Pilgrimage Centre Tirupati & Tirumala*

**WOOD SIDE ANNEXE**

Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.

**WOODSIDE**

**HOTEL WOODSIDE**

E.Car Street, Tirupathi. Ph : 2284464

ఆడుకుని ఆనందించు. అనుకూల పరిస్థితులలోని స్వారస్యాన్నీ, ప్రతికూల పరిస్థితులలోని స్వారస్యాన్నీ ఆస్వాదించు. వాటివల్ల ఉద్విగ్నుడవు కావద్దు, అస్థిరుడవు కావద్దు, సమతూకాన్ని కోల్పోవద్దు. సంతోష దుఃఖాల ఈ బాల్య క్రీడలలో మనం మునిగిపోకూడదు. మనం ఆత్మపరాయణులం కావాలి. 'స్వః 'ను తెలుసుకోవాలి. ఆత్మచింతనలో, ఆత్మ విశ్వాసంలో, ఆత్మ గౌరవంలో, ఆత్మ నిష్ఠలో, ఆత్మ సాధనలో, ఆత్మోన్నతిలో, ఆత్మ నిర్మాణంలో మనం మన ఇచ్ఛా శక్తినీ, ఊహాశక్తినీ, క్రియాశక్తినీ వినియోగించాలి. ఎందుకంటే– లోపలి మూల కేంద్రం, జన్మస్థలి ఆత్మయే. ఆత్మ–స్థితుడయిన మనిషి అంతరంగం ఆరోగ్యకరంగా ఉంటుంది. కనుక అతడు సదా సంతోషంగా ఉంటాడు.

### తత్

జీవన, మరణాల రహస్యాన్ని తెలుసుకో. భయం, ఆసక్తీ లేకుండా జీవించు. వాస్తవికత అనే గట్టి ఆధారంగా నీ కార్యకలాపాలను రూపుదిద్దుకో. జీవితంలోని క్షణాలను సద్వినియెగపరచుకుంటే, ఆత్మలాభం అనే నిజమైన ప్రయోజనం కోసం వాటిని ఉపయోగిస్తే– నేడో రేపో మృత్యువు ఎదురైనపుడు మనం దుఃఖించ వలసిన అవసరం ఉండదు.

### సవితుః

సూర్యునివలె తేజస్విగా మారు. సప్త బలాల్నూ నీ జీవిత రథానికి కట్టివేయి. మన అదృష్టానికీ, మన పరిస్థితులకూ నిర్మాతలం మనమే. మన సామర్థ్యం ఆధారంగా మన ప్రతి ఇచ్ఛనూ, ప్రతి అవసరాన్నీ పూర్తి చేసుకునే బలం మనకు పూర్తిగా ఉంది. శరీర బలం, బుద్ధి బలం, విద్యాబలం, ధన బలం, సంఘటనా బలం, శీలబలం, ఆత్మబలం– ఈ ఏడూ జీవితంలో వెలుగునూ, ప్రతిష్ఠనూ, సంపదనూ, స్థిరత్వాన్నీ నింపడానికి అవసరం అవుతాయి.

### వరేణ్యమ్

మనం దురాలోచనను వదిలి సదాలోచనను స్వీకరించాలి. అమంగళకరమైన ఆలోచనను వదిలి, మంగళకరమైన ఆలోచనను స్వీకరించాలి. అందువల్ల మనస్తాపం, అసంతృప్తి అంతమవుతాయి. అంతటా అన్ని పరిస్థితులలో ఆనందం తాండవిస్తుంది. ఒక మనిషి ఆంతరిక ఉన్నతియే అతడి శ్రేష్ఠత్వానికి కారణం అవుతుంది. మనం గొప్పవాళ్లం కావాలి. శ్రేష్ఠులం కావాలి, సంపన్నులం కావాలి. అయితే భౌతిక వస్తువు కాక, ఆంతరంగిక పరిస్థితి వాటికి పునాది కావాలి.

### భర్గో

మనుషులు పాపరహితులు కావాలి; పాపాల పట్ల మెలకువ వహించాలి; పాపాల వల్ల కలిగే దుష్ఫలితాలను గుర్తించి వాటిని ఏవగించుకోవాలి; వాటిని నాశనం చేయడానికై నిరంతరం సంఘర్షణ జరుపుతూ ఉండాలి. పవిత్రత కోసమై మన కృషి కొనసాగితే ప్రపంచంలోని కష్టాలనుండీ, భవ బంధనాలనుండీ విముక్తి పొంది, మనం జీవన్ముక్తునిలో ఉండే స్వర్గమయ ఆనందాన్ని చూరగొనగలుగుతాం.

### దేవస్య

మలినమైన దృక్పథాన్ని వదిలి, విశుద్ధమైన ఆలోచనా విధానాన్ని అవలంబించాలి. అసురత్వపు విధానాన్ని వదిలి, దేవత్వపు కార్యకలాపాలను చేపట్టాలి. భవిష్యత్తులో దుఃఖాన్ని కలిగించే ఆత్మను పతనం చెందించే క్షణిక సుఖాలకూ, ఆకర్షణలకూ, ప్రలోభాలకూ దూరంగా ఉండాలి. మనం దేవతత్వాన్ని వికసింపజేసుకోవాలనీ, దేవత్వాన్ని ప్రోత్సహించాలనీ, దైవీకమైన ఆత్మ సంకేతాలను అనుసరించాలనీ గాయత్రి బోధిస్తుంది.

కృతజ్ఞతలు – **ఎ.సుబ్బారావు**

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

**204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)**
**(Opposite Bus Station)**
**Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911**
**e-mail : mayurahotels@yahoo.co.in, Grams :**

## మన ఆంధ్రులంతా ఒకటేయని చాటాలి. నదీ సంగమంలా కలిసి రావాలి! ప్రత్యేక భాషా రాష్ట్రం కావాలని పోరాడిన తెలుగువారు, భాష విషయం పట్టించుకోవాలి!

**200** సంవత్సరాలకు పైగా తెలుగు (ఆంధ్ర) భాషా రాష్ట్రం కావాలని పోరాడిన తెలుగువారు భాషా అభివృద్ధి విషయంగా తగిన శ్రద్ధబూనలేదు.

అవసరవసరంగా కర్నూలు రాజధానియని వెళ్ళారు. అక్కడ ఆవగింజంతయినా అభివృద్ధి చేయలేదు. సంవత్సరం తిరగకుండా ఆంధ్రప్రదేశ్ అంటూ ఆదరబాదరాగా హైదరాబాద్‌ను రాజధాని చేసుకున్నారు. నిజాము పాలనం నుంచీ విముక్తి పొందిన ప్రాంతం కాబట్టి సగం ఉరుదు, సగం తెలుగూ అయినందున తెలుగు భాష సగం సౌరభం కోల్పోయింది. తెలంగాణా పోరాటానికి అంకురార్పణ జరిగింది. హైదరాబాదు జంటనగరాలు తెలంగాణావంటూ– తెలుగు అన్నదమ్ముల విడిబాటుకు తోరణం కట్టింది. అక్కణ్నుంచి ఆంధ్రులుగా పిలవబడేవారులు మూటా ముల్లె గట్టుకుని విజయవాడ వెళ్ళాలనుకున్నారు. రెండింతల జనాభాను భరించే స్థలమూ, శక్తీ విజయవాడకు లేదు. కృష్ణాతీరాన్ని కొంతమూసి విద్యాలయాలు పెంపొందించాలనుకున్నారు. అప్పటికే కొందరు ఆ తీరాలను ఆక్రమించి బృహద్భవనాలు నిర్మించేసారు. మరింతమందికి స్థలమొసగే శక్తి కృష్ణా తీరానికి లేదు.

గుంటూరు జిల్లా తీరమైన అమరావతిని కొత్త రాష్ట్ర కేంద్రంగా చేయాలను కుంటున్నారు.

అమరావతి ఒకప్పుడు తెలుగు ప్రాంతపు రాజధానే! అక్కడ బౌద్ధమతం వ్యాపించి ఉన్నది. బుద్ధుని శిష్యుడు నాగార్జునుడు నాగార్జున కొండవరకూ బౌద్ధాన్ని వ్యాపింపచేసాడు. ఇప్పటికీ బౌద్ధ స్థూపాల ఆనవాళ్ళు కనిపిస్తుంటాయ్. కృష్ణా తీరాన వెలసిన అమరేశ్వరుడు కొంత కట్టడి చేయబడ్డి కృష్ణానదీ కీవల ఆవలా ఆంధ్రదేశం ఆవరించి ఉన్నది.

ఇటు అమరేశ్వరుడు, అటు కనకదుర్గమ్మ కృష్ణా తీరపు రాజధానికి బాసటగా ఉన్నారు. అదే ఏర్పడబోయే నవీనాంధ్ర రాజధానిగా అమరావతి పురర్నగరంగా వెలుగొందుతూంది. అలనాటి రాజసాన్ని విరయబూచగలదు.

నవీనాంధ్ర రాజధాని నగర నిర్మాణం కృతనిశ్చయంతో జరిపితేనే సాధ్యం. సీమతో చెలిమి చేసి సీమాంధ్ర అభ్యున్నతికి కృషి జరపాలి. కృష్ణా, తుంగభద్ర, గోదావరీ నదులు భువి నందు తాండవిస్తే, భువి దివిస్థాయికి ఎదగగలదు. విజయనగరం మరల కృష్ణరాయలేలిన సీమగా, కృపాంధ్రగా రతనాల రాశుల్ని, రాజవీధులందు ప్రోదిచేసి ఘనాంధ్ర సీమగా రాజనాలు పండించగలదు.

**అస్తు, తథాస్తు.**



# ప్రయాణం పాట నేర్పింది పాట అంతర్లీనంగా బలమైన సాహితీముద్ర వేసింది

"ప్రకృతిని, ప్రజలను ప్రేమించేవాడికి ప్రయాణాలు తప్పకుండా మధురానుభూతి కలిగిస్తాయి. చాలామందిని దగ్గరగా పరిశీలించే అవకాశం... సమాజం గురించి ఎంతో కొంత అవగాహన చేసుకునే సందర్భం ప్రయాణాల్లోనే లభిస్తుంది. ఇంట్లో నాలుగ్గోడల మధ్య మనం చూసే మనుషులకు, ప్రయాణాల్లో మనం చూసే మనుషులకు ఎంతో తేడా ఉంటుంది. మానవ సంబంధాల చుట్టూ నేను రాసిన పాటలకు పునాది నా చిన్ననాటి ప్రయాణాలూ, నాకు తారసపడ్డ మనుషులే". కాలేజీలో చదువుతున్న రోజుల్లో సొంత ఊరు సుద్దాల నుంచి చేసిన దక్షిణ భారతయాత్ర చేసాను. గీత రచయితగా మారిన తర్వాత ఆదిలాబాద్ అడవుల గుండా చేసిన కారు ప్రయాణం నాలో కొత్త ఆలోచనలను రేకెత్తించింది. మానవ సంబంధాల పట్ల కొత్త దృష్టి కోణాన్ని ఏర్పరించిం దంటున్నారు సుద్దాల అశోక్‌తేజ.

స్పందించే హృదయముంటే... పాటల్లో వినిపించే నవరసాలూ మనకు ప్రయాణాల్లోనూ కనిపిస్తాయి. పాటను ఆస్వాదించినట్టే... ప్రయాణాన్ని ఆస్వాదించగలిగితే వృత్తి వికాసానికి, వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో తోడ్పడుతుంది. నేను గీత రచయితగా మారడానికి మా నాన్న (సుద్దాల హనుమంతు) 'పాట' వారసత్వంతో పాటు...'బాట', తత్వం కూడా కారణం. చిన్నప్పటి నుంచి ఇప్పటిదాకా నేను చేసిన అనేక ప్రయాణాలు నాకు తెలియకుండానే నాలో అంతర్లీనంగా బలమైన ముద్రలు వేశాయి. అవే మానవ సంబంధాల విలువను నా పాటల్లో ప్రతిబింబించేలా చేశాయి.

మా ఊరు సుద్దాలలో రెండేళ్లకొకసారి తీర్థయాత్రలకు బస్సు సర్వీసు నడిచేది. అంటే తీర్థయాత్రల పట్ల ఆసక్తి ఉన్న ఊరి జనాన్ని ఒక టూరిస్టు బస్సులో తీసుకుని పది, పదిహేను రోజులు టూరు వేసేవారు. ఆ సర్వీసును మా ఊళ్లో ఐలన్న, రాములు, సత్యనారాయణ అనే నా మిత్రులు (నా కన్నా వయసులో పెద్దవాళ్లు) ఏర్పాటుచేసేవారు. ఎప్పటిలాగే ఆ యేడాది కూడా బస్సు సిద్ధం చేశారు. టికెట్లన్నీ అమ్ముడయ్యాయి. ఒక్క సీటు కూడా ఖాళీ లేదు. నన్ను కూడా తమతో ఆ బస్సులో తీసుకెళ్లాలనేది నా మిత్రుల కోరిక. 'బస్సులో సీటు లేకపోయినా సరే క్లీనర్ కూర్చునే సూటు ఉంది కదా, సర్దుకుని వెళ్దాం రమ్మ'ని తెగ బలవంతపెట్టారు. నాక్కూడా వెళ్లాలని ఉన్నప్పటికీ టికెట్టులేని కారణంగా వద్దనుకున్నాను. అయితే చివరి నిమిషంలో మా ఇంట్లో ఒప్పించి, టికెట్ లేకున్నా నన్ను బస్సు ఎక్కించారు. బస్సులో అంతా మా ఊరి వాళ్లే. వారందర్నీరోజూ నేను చూస్తూనేఉంటా. అయితే ఇంటి (తరువాయి 15వ పేజీ)

## నాలుగో తరగతి చదువుతున్నప్పుడే పాటలు వ్రాసాను. నా పాటలు విన్నవారు చక్కని ఆలోచనాపరుడన్నారు.

మాది నల్గొండ జిల్లా సుద్దాల. అమ్మ జానకమ్మ, నాన్న సుద్దాల హనుమంతు. సుద్దాల మా ఇంటి పేరుగా మారడానికి ఓ నేపథ్యం ఉంది. నాన్న తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న వ్యక్తి. పాటలు పాడుతూ, ప్రజల్లో చైతన్యం రగిలిస్తూ ఉద్యమం సాగించిన వ్యక్తి. సుద్దాల హనుమంతు అని ప్రజలే ఆయన పేరును స్థిరపరిచారు. నేను పెద్ద కొడుకును. మా ఇంటికి వచ్చే నాయకులూ పెద్దల మధ్య పాటల గురించి చర్చలు జరిగేవి. వారి మాటల్ని వింటూ పాటపై ఆసక్తిని పెంచుకున్నా. పూర్తిగా చదవడం, రాయడం రాక ముందే శ్రీశ్రీ మహా ప్రస్థానాన్ని నా చేతికిచ్చి చదివించారు నాన్న. నాలుగో తరగతి చదువుతున్నప్పుడే పాటలు వ్రాసాను. 'ధగధగ లాడే జెండా, నిగనిగ మెరిసే జెండా... వినవే పేదల గాథ, చల్లారదు ఆకలి బాధ' అని రాసి మా అమ్మకు వినిపించా. మా అమ్మేమో నాన్నకు వినిపించింది. నాన్న ఊరి పెద్దలందర్నీ పిలిపించి ఒక చిన్న టీ పార్టీ పెట్టి నా చేత మళ్లీ ఆ పాట పాడించారు. అంతా అభినందించిన అభినందనలు సదా నన్ను వెంటాడుతూ ముందుకు నడిపిస్తున్నాయి.

మాది చాలా పేద కుటుంబం. నాన్న ఆర్ఎంపీగా వైద్యం చేసేవారు. అమ్మ మిషన్ కుట్టి వేణ్ణీళ్లకు చన్నీళ్లగా సాయపడేది. ఆరో తరగతిలో డాక్టర్ సి. నారాయణరెడ్డిగారి 'ఈ నల్లని రాళ్లలో ఏ కన్నులు దాగెనో' పాట విన్నా. బాగా నచ్చింది. ఎలాగైనా సరే ఆయనలా సినిమా పాటలు రాయాలను అప్పుడే నిశ్చయించుకున్నా. మా ఊరి నుంచి సీతారాంపురానికి ఏడు కిలోమీటర్ల దూరంలో నటుడు ఉత్తేజ్ ఊరు ఉంది. ఉత్తేజ్ మా అక్క కొడుకే. నా ఉన్నత విద్య ఆ ఊళ్లోనే సాగింది. తోటి మిత్రులతో ఆ ఊరు నడిచెళ్లి చదువుకున్నా. రాములు, ఐలయ్య, జగన్, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ... స్కూల్లో నా మిత్రులు. నేను రాసే పాటల్ని విని మెచ్చుకునేవారు. మిత్రుల ప్రోత్సాహంతో... సినిమాలు చూసి వాటిని నాటకాలుగా రాసేవాణ్ని. వాటిలో నా మిత్రులే తలా ఒక పాత్రను ధరించేవాళ్లు. స్కూల్లో ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమాలైనా నా బహుమతులు నాకు వస్తుండేవి.

పదో తరగతి తరువాత ఇంటర్‌లో చేరాలి. అమ్మ తన చెవుల కమ్మలూ కాళ్ల కడియాలూ అమ్మి 130 రూపాయలు ఇచ్చింది. వాటిని జేబులో పెట్టుకుని హైదరాబాద్ లోని యాకుత్‌పురా ధర్మవంత్ కాలేజీలో ఇంటర్‌లో చేరా. రాజేంద్రనగర్‌లో ఉంటూ ట్యూషన్లు చెబుతూ ఇతర పనులు చేస్తూ ఇంటర్ పాసయ్యాను. కొంత కాలం నిరుద్యోగం... కొంతకాలం తరువాత చిరుద్యోగం. నిరుద్యోగిగా ఉన్నప్పుడు బిల్డింగ్‌లు కట్టే మేస్త్రి దగ్గర కూడా పనిచేశా. రాళ్లూ ఇసుక తట్టలూ మోశా. 'రాయి సలాక ఇసుక ఇటుక తాపీ తట్ట సిమెంట్ చెమట... గోడమీద గోడ...మేడమీద మేడ' పాటను రాసాను.

బతుకుతెరువు కోసం కరీంనగర్ జిల్లా బొమ్మల మేడిపల్లి వెళ్లాను. లక్ష్మారెడ్డి పరిచయమయ్యారు. ముగ్గురమూ మంచి స్నేహితులమయ్యాం. నాకు ఓ ప్రైవేటు స్కూలు పెట్టాలన్న ఆలోచన వచ్చింది. సంగం లింగారెడ్డి అని ఒకాయన తన ఇంటిని స్కూలు కోసం ఇచ్చారు. లింగంగౌడ్, లక్ష్మారెడ్డిలు సహకారం అందించారు.

# కాకతీయుల కాలంలోనే విద్యావిధానం సాంప్రదాయ పద్ధతిలో ప్రారంభమైంది!

విద్య యశస్సును ఆనాడే గుర్తించారు. విద్యలేనివాడు వింతపశువు అన్న రూఢీకి ఆనాడే ప్రభువులు వచ్చారు. అనేక ప్రాంతాల్లో కళాశాలలు నెలకొల్పారు. మారుమూల ఆ్రపంతాల్లో ప్రారంభిక విద్యాలయాల్ను నెలకొల్పారు. మత బోధకమైన విద్యాలయాలను, గీర్వాణ భాషా విద్యాలయాలనూ నెలకొల్పారు. కావ్యాలనూ, వ్యాకరణాది విషయాలనూ, గణితానికి మూలమైన గుణింతాలనూ నేర్పుతూ వచ్చారు. న్యాయ మీమాంసాది విద్యలను అధ్యయనం చేస్తూ వచ్చారు.

"ఓం నమశ్శివాయ" అనుషడక్షరీ విద్యారంభం జరుగుతూ వచ్చింది. ఉచ్చారణ కనుకూలమగు లఘు గురు అక్షరములతో విద్యారంభ ప్రాభవం అమలులోకి తెచ్చారు. హిందూ స్థానములో ముఖ్యంగా మలయాళంలో 'శ్రీ గణేశాయనమః' అని గణనాధుని స్తుతితో విద్య ప్రాంభమయ్యేది. కర్ణాటకములో ఓ నమఃశివాయఃతో బాటు 'సిద్ధం నమః' చేర్చి చెప్పేవారు. జైనమత విశ్వాసకులు 'ఓం నమః సిద్ధేభ్యః' అనుచూ అక్షరాభ్యాసములు చేయించేవారు.

దక్షిణదేశమంతా 'ఓ నమఃశివాయ ఓం స్వస్యం కం స్తుమ సిద్ధం' అనే విద్యాభ్యాసం చేస్తుంటే 'నమఃసిద్ధేభ్యం' అనుటకు క్లుప్తంగా 'సిద్ధం నమః' అనుచూ వచ్చారు. ఇది దేశాచారముగా తెలుగులోనేగాక దక్షిణదేశంలో ప్రాచుర్యంలోకి వచ్చింది.

భాషా జనతరములు మారుతున్న కొద్దీ భాషాభాషణములు పుట్టవలసి వచ్చెను. బాషా భూషణమైందే కానే ఎవరి శాసనాలకూ భాష కట్టుబడి ఉండలేదు. కానీ ఎవరి శాసనాలకూ భూషణము మారలేదు.

కాకతీయుల కాలమునందే తిక్కన సోమయాజి, ఆయన శిష్యులగు మారన, కేతన, మంచెన లతో బాటు గోనబుద్ధుడు, పాల్కురికి సోమనాధుడు, భద్రభూపాలుడు, రావిపాటి తిప్పన్న, నాచనసోముడు, భాస్కరుడు, మల్లిఖార్జున పండితారాధ్యులు ఆదిగాగల మహాకవి శ్రేష్టులుండిరి. సంస్కృతము నందు విద్యానాధుడు అను పేరుగల కవిశ్రేష్టుడుండెను. ఇంకనూ ఎందరో కవి శ్రేష్టులుండిరి, గానీ, ఆ చరితనంతను విపులీకరించిన యీ వ్యాస విస్తీర్ణము పెరిగి – ఓ కవుల చరిత్రగా పరిణమించునని కాకతీయ విద్యావిధానము వివరించుట క్లిష్ట భూమిష్టమై చెప్పదలచుకున్న ముఖ్యత్వం మూలపడునని ముగించుచున్నాను.

# పేగు బంధం గొప్పదా? ప్రేమ బంధం గొప్పదా? అంటే పేగుబంధమే గొప్పదనాలి!

పన్నెండు సంవత్సరాలు వచ్చినా, పద్దెనిమిది సంవత్సరాలు వచ్చినా, పళ్ళూడే పండు వయసు వచ్చినా, పేగుబంధానికి సాటి, ప్రేమబంధం కాదు! పేగు త్రెంచుకుని పుట్టేది పేగుబంధం ! ఎందుకో నా మనసు పసిడివయసుప పేగు త్రెంచుకుని పుట్టిన ప్రే(మ)గుబంధం మీదకుపోయింది. ప్రసవించేటప్పుడు అమ్మపడే నొప్పుల బాధ కళ్ళకు గట్టినట్లనిపించింది.

అమ్మ ఆ క్షణంలో అనుకుంటుందట, ఇది నా ఊహే కావచ్చు. కానీ పచ్చినిజం.

నాన్నా! నువ్వు నన్ను అమ్మను చేస్తున్నావని పరమానందంగా ఉన్నది. నీవు నా కడుపులో కదులాడుతున్నప్పుడు ఊపిరాడకుండా అటూ ఇటూ కదులాడుతూ హడావుడిచేస్తుంటే హుషారైన వాడివనే ఉత్సాహం పడ్డాను.

నన్ను చీల్చుకుని ఈ లోకంలోకి వచ్చాక నా ప్రతిరూపం వచ్చిందని పొంగిపోయాను. నా రక్తాన్ని నీవు పాలుగా త్రాగుతుంటే అందరికన్నా బలవంతుడవవుతావని, కావాలని ఆశీర్వదిస్తున్నాను.

నీవు తప్పటడుగులు వేస్తూ, ఇల్లంతా తిరుగుతూంటే తట్టుకోలేనంత ఆనందం కలిగింది. నీ కాళ్ళమీద నీవు నిలబడగలవని విశ్వాసం కలిగింది.

ఆ అడుగుల్లోనే దూరమైతే గొప్పవాడవవ్వాలని ఆశీర్వదిస్తున్నాను. జీవన ఒత్తిడిలో నన్ను మరిచిపోతే, నేను లేకపోయినా నీవు బ్రతకగలవని నమ్మకం కలిగింది. ప్రాణం పోయేటప్పుడు నీవు కంట తడిపెట్టకుంటే నాకెంతో తృప్తికలిగి, నీకు తట్టుకునే శక్తి ఉందని –

ఇప్పుడే బాధగా ఉంది, నేను చనిపోయేనని అందరూ ఏడుస్తుంటూ నా కాటికి నీవు పెట్టే నిప్పులో నీ చేయి కాలుతుందేమోనని బాధగా ఉంది.

అమ్మానాన్నల పట్ల నీకెంత బాధ ఉందో తెలుసురా. అందుకే ఇలా ముందుగానే బాధపడుతున్నాను.

---

(14వ పేజీ తరువాయి) దగ్గర వారిని చూసిన దృశ్యం వేరు... ప్రయాణంలో వారిని చూసిన దృశ్యం వేరు. టూరులో ఒక భర్తతో భార్య, తల్లితో కూతురు, బావతో బావమరిది, ఇంకా పిల్లలు. ముసలోళ్లను పదిహేను రోజుల పాటు దగ్గరగా చూడటం అనేది భవిష్యత్తులో నా పాటల ప్రయాణానికి పునాది అవుతుందని ఊహించలేదు.

పదిహేను రోజుల్లో ఆ బస్సులో ఒక మినీ ప్రపంచాన్ని చూసిన అనుభూతి నాకు కలిగింది. రాత్రి వేళల్లో అందరూ హాయిగా నిద్రపోతుంటే నేను మాత్రం స్టూలు మీద కునికిపాట్లతో ఇబ్బంది పడేవాణ్ణి. నా అవస్థ చూసిన ఒకరిద్దరు తమ సీట్లలో పడుకోమని కోరినా మొహమాటం వల్ల ఫర్వాలేదంటూ అలాగే కూర్చునేవాణ్ణి. అది గమనించిన ఒక పెద్దవ్వ 'కూసోని కూసోని కాళ్లు మొద్దువారుతున్నయ్‌గానీ ఓ పిల్లగా నువ్వు కాసేపు ఈ సీట్లో ఒరుగు...నేను బస్సులోనే అటిటూ తిరుగుతా' అంటూ నాకు సీటు ఇచ్చింది. నా మొహమాటాన్ని పోగొట్టేందుకు పెద్దవ్వ కాళ్లు మొద్దువారుతున్నాయనే వంక చూపిందనే సంగతి గ్రహించి నేను కదిలిపోయాను. ఆ రాత్రంతా పెద్దవ్వ ఏం చేసిందోగానీ, నేను మాత్రం ఆమె సీట్లో ఒళ్లు మరిచి నిద్రపోయాను. ఒక మనిషి అవసరాన్ని, అవస్థను గుర్తించి... కాస్త కష్టమైనా భరించొచ్చనే భావన ఎంతమందిలో ఉంటుంది? అలాగే వారు తెచ్చుకున్నదానిలో నాకు పెట్టడం ద్వారా ఆ తర్వాత రోజుల్లో తమకు ఇబ్బంది అవుతుందని తినే సమయంలో నన్ను పిలిచేందుకు మొహమాటపడిన వారిని కూడా నేను ఆ టూరులో చూశాను. వీటితో పాటు కొత్తగా పెళ్లయిన జంటల రొమాన్స్... ముసలోళ్ల అవస్థలు... పిల్లల గోల... కులాల భేషజాలు... ఆయా వ్యక్తుల ఫాల్స్ ప్రిస్టేజీ... అన్నీ నా మనోఫలకంపై బలంగా నాటుకున్నాయి. ఆ సామాజికవర్గాలకు చెందిన వ్యక్తుల ప్రవర్తన, కొందరి వికృత మనస్తత్వాలను కూడా ఊళ్లో కన్నా బస్సు ప్రయాణంలోనే జాగ్రత్తగా పరిశీలించే అవకాశం కలిగింది. ఆ పరిశీలనే తర్వాత నా పాటల్లో ప్రశ్నల రూపంలో బయటికొచ్చాయాయేమో అనిపించింది.

అదే విధంగా శ్రీశైలం అడవుల్లో ఘాట్ రోడ్లపై బస్సు ప్రయాణిస్తున్నప్పుడు కనిపించే పొడవైన చెట్లను, ఇతర దృశ్యాలను చూపించి నా స్నేహితులు సరదాగా, స్పాంటేనియస్‌గా అవి ఎలా కనిపిస్తున్నాయో కవితాత్మకంగా చెప్పమని (అప్పటికే నేను రచయితను కాబట్టి) ఛాలెంజ్ చేసేవారు. అప్పటికప్పుడు వాటి మీద పాట కట్టేవాణ్ణి. ఆ సరదా, సాధన నాకు సినిమాల్లో పాటలు రాసేందుకు బాగా పనికొచ్చింది. ఇప్పటికీ సినిమా డైరెక్టర్ సీన్ చెబుతున్నప్పుడే స్పాంటేనియస్‌గా కొన్ని పదాలు వచ్చేస్తుంటాయి. ఇలా నాకు కవిత్వం అబ్బింది; ఓ కవిగా రూపొందించింది. **(సశేషం)**



# శ్రీ భగవద్గీతా మకరందం!



శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

108

## పదునెనిమిదవ అధ్యాయము - మోక్ష సన్న్యాస విభాగయోగము

**58. మచ్చిత్తస్సర్వదుర్గాణి మత్ప్రసాదాత్తరిష్యసి**
**అథ చేత్త్వ మహఙ్కారాన్న శ్రోష్యసి వినఙ్క్ష్యసి.**

**వ్యాఖ్య :** లోకములో ప్రతివారును తమకు దుఃఖములెవ్వియును కలుగగూడదనియు, సుఖములే కలుగవలెననియు వాంఛించుదురు. కాని అందులకై, ఏ సాధన చేయవలెనో దానిని మాత్రము చేయరు. ఆ సాధన యెద్దియో భగవానుడే యిచట భక్తులపై కరుణచే తెలిపివైచిరి. సర్వేశ్వరునియందు ఎవరు తమ చిత్తమును లగ్నమొనర్చుదురో అనగా ఎవరు తమ చిత్తమును దృశ్యమందుంచక, విషయములందు సంచరింపనీయక ఆత్మయందే (భగవంతునియందే) కేంద్రీకరించుదురో, అట్టివారికి భగవదనుగ్రహము వలన సమస్త దుఃఖములు, ఆటంకములును నశించిపోవును. 'సర్వ' అనుపదమును ప్రయోగించుటవలన ఏవియో కొన్ని ఆపదలు మాత్రము నశించుటకాదనియు భగవద్భక్తులకు సమస్త ఆపదలు, దుఃఖములు తొలగిపోవుననియు భావము. ఇట్టి స్థితియే కదా ప్రతివారును కోరునది! జీవులపై కరుణచే భగవాను డీ ప్రకారముగ తెలియజేయుచున్నారు– 'ఓ జీవులారా! మీ చిత్తమును నాయందు (ఆత్మయందుఏ భగవంతునియందు) లగ్నము చేయుడు. దానికి ప్రతిఫలముగ నేను మీ యొక్క సమస్తసాంసారిక దుఃఖములను, ఆటంకములను పారద్రోలెదను.!' కాబట్టి భగవద్వాక్యములపై పరిపూర్ణ విశ్వాసముంచి మనుజులు భక్తిభావసమన్వితులై, దైవ సంలగ్నచిత్తులై– మెలగవలయును.

'దుర్గాణి'– దుర్గమనగా కోట, ప్రతిబంధము అని అర్థము. మాయ జీవుని చుట్టును పెక్కు అడ్డుగోడలను, దుఃఖములను ఆటంకములను, విఘ్నములను ఏర్పాటు చేసియుంచినది. సంసారశృంఖములచే జీవుని కట్టివైచినది. అట్టి దుర్గములను భేదించుటకు లౌకిక ఉపాయములు పనికిరావు. మాయను చేధింపవలెనన్న మాయాధీశుడే శరణ్యము. కావున దుఃఖరాహిత్యమునకై సుఖానుభూతికై పరమాత్మ యొక్క చరణారవిందములను పట్టుకొనుటయే, పరమాత్మను ధ్యానించుటయే జీవులకు ఏకైక మార్గము. వేఱుదారిలేదు.

'మత్ప్రసాదాత్'– యనుగ్రహముచే దుఃఖమును దాటగలవు. భగవానునకు అందఱును సమానులే అయియున్నప్పటికిని ఎవరు వారిని భక్తి పూర్వకముగ ధ్యానింతురో, సేవింతురో, అట్టివారి యెడల మాత్రమే వారు తమ యనుగ్రహమును జూపుదురు. గాలి అంతటను వీచుచున్నను ఎవరు తెరచాప నెత్తుదురో వారి పడవ మాత్రమే కదులును. చెట్టు క్రిందకు ఎవరు వెళ్లుదురో వారికి మాత్రమే చెట్టునీడ యొసంగును. కాబట్టి సుఖానుభూతి కావలసియున్నదో భగవంతుని ఆశ్రయించుటతప్ప వేఱొక ఉపాయ మెద్దియును లేదు.

ఒకవేళ యెవ్వరైన అహంకారముచేగాని, ధన మదముచేగాని, అధికార గర్వముచే గాని, భగవానుని ఈ వాక్యములపై విశ్వాసము లేకయుండినచో, లేక ఈ వాక్యములను వినకుండినచో వారు చెడిపోవుదురనియు, శ్రద్ధగలిగి తదనురీతి యాచరించి తరించుట జీవుల కర్తవ్యము.

**59. యద్యహఙ్కారమాశ్రిత్య (పాఠాన్తరము) న యోత్స్య ఇతి మన్యసే**
**మిథ్యైష వ్యవసాయ స్తే ప్రకృతిస్త్వాం నియోక్ష్యతి**

**వ్యాఖ్య :** కర్తృత్వమునువీడి, క్షత్రియోచితమగు ధర్మయుద్ధమును గావింపుమని అర్జునునకు భగవానుడిదివఱలో తెలిపియుండిరి. ఇప్పుడు 'ఓ అర్జునా! అహంకారము వలన నా యీ వాక్యములను ఉల్లంఘించినచో అది నీయొక్క వ్యర్థప్రయత్నమే కాగలదు. ఏలయనిన, నీ క్షత్రియసంబంధ ప్రకృతియే, స్వభావమే బలాత్కారముగ నిన్ను యుద్ధమున దింపగలదు' అని భవిష్యత్‌జ్ఞానముగల పరమాత్మ వచించిరి.

**60. స్వభావజేన కౌన్తేయ! నిబద్ధస్స్వేనకర్మణా**
**కర్తుం నేచ్ఛసి యన్మోహా త్కరిష్యస్యవశోఽపి తత్.**

**వ్యాఖ్య :** 'నిబద్ధః' – మనుజుడు తన కర్మచేతనే తాను బంధింపబడియున్నాడు. 'బద్ధః' అని చెప్పక 'నిబద్ధః' అని చెప్పుటవలన లెస్సగ బంధింపబడియున్నాడని భావము. పూర్వజన్మ సంస్కారము అర్జునునకు యుద్ధము చేయునదిగా నుండి యున్నదని త్రికాలజ్ఞులగు భగవానుడు తెలిసికొనిరి. కావుననే 'నేను యుద్ధము చేయను అని నీవనుకొనినను సంస్కారప్రభావముచే 'యుద్ధము చేసియే తీరుదువు' అని అర్జునునకు ధైర్యముగా తెలియజేయగల్గిరి. ఇంతమాత్రముచేత పురుష ప్రయత్నవము వ్యర్థమని యెవరును తలంపరాదు. మనుజునకు (1) పూర్వజన్మ సంస్కారము (2) ఇహజన్మ పురుషప్రయత్నము అని రెండు కలవు. ఈ రెండింటికిని నిరంతరము జీవునియందు సంఘర్షణ జరుగుచునే యుండును. అందు ఇహజన్మ పురుషప్రయత్నము అధికముగా నున్నచో పూర్వజన్మ సంస్కారము జయించి వేయబడును. ప్రతివారికిని వారి పూర్వజన్మ సంస్కారమెట్టున్నదో తెలియదు గనుక తీవ్రపురుషప్రయత్నముచే ఈ జన్మమందు దైవిక సంస్కారములనే అలవాటు చేసికొనినచో పూర్వదుస్సంస్కారము లేవైనయున్నచో అవియన్నియు వానిచే జయించివేయబడును. ఇప్పటి ప్రయత్నము అధికముగ లేనిచో పూర్వ సంస్కారములే జయించును కావున జీవుడు బహుజాగరూకుడై ప్రయత్నపూర్వకముగ దైవ సంస్కారములను అభ్యసించవలెను.

*(తరువాయి వచ్చే సంచికలో)*





# సచ్చిదానందమూర్తి కందుకూరి శివానందమూర్తి నామనః పలకంపై నిలిచే ఉన్నారు!

## -నా మనోనేత్రం ఆయన్ను నిరతమూ దర్శిస్తూనే ఉంది!-

గురువేబ్రహ్మా గురువేవిష్ణువు గురువే పరమశివుడు! గురువును మించిన దైవం లేడనేది పరమసూక్తి

భీమిలిలోని ఆనందాశ్రమం గురుదేవుల ఆశ్రమం. వారి భక్తుల సౌలభ్యం కోసం వరంగల్‌లో కూడా ఒక ఆశ్రమం ఉన్నది.

గురుదేవులు 1928 సంవత్సరం డిసెంబర్ 20న కందుకూరి వీరబసవరాజు, సర్వమంగళాదేవి దంపతుల అనుంగు బిడ్డగా జన్మించారు. ఆయన జననమందిన దాది అనేక మహత్తర సంఘటనలు సంభవించాయ్. ఉత్తర భారత దేశానికి చెందిన మహాయోగి – తనకు తానుగా వచ్చి ఒక మహామంత్రం ఉపదేశించారు.

శివానంద గురుదేవుల మహత్తర జీవితానికో ప్రయోజనం ఉందని భావించి పదిహేడేళ్ళ వయసులోనే వరంగల్ ప్రాంతానికి వెళ్ళారు.

ఎక్కడి రాజమండ్రి, ఎక్కడ వరంగల్ అంతటి సుదూరప్రదేశం వెడ్తున్నావుగా అని వారి తండ్రి ఓ వెయ్యిరూపాయలిస్తూ తీసుకుని వెళ్ళమన్నారు. నాకంత డబ్బు అవసరం లేదు, ఓ వందరూపాయలు ఇవ్వండి చాలు– అంటూ ఒక్క వందరూపాయలు తీసుకునే వరంగల్ వెళ్ళారు.

వరంగల్ చేరిన తరువాత పోలీసుశాఖలో 140 రూపాయల జీతమ్మీద ఎన్నో సంవత్సరాలు పని చేసి స్వచ్ఛందంగా విరమణ చేసారు.

1950 సం॥ములో వారికి వివాహం జరిగింది. నలుగురు సంతానం కలిగారు. 1984 సం॥ములో వారికి సతీవియోగం జరిగింది. అప్పట్నుంచీ వారు ఉద్యోగ బాధ్యతలనూ, సంసార బాధ్యతలనూ చూసుకుంటూ, యోగసాధన కూడా చేసేవారు. వేదవేదాంగ గ్రంథాలను క్షుణ్ణంగా చదివారు. భగవద్గీతను అధ్యయనం చేసారు. 1971 సం॥ము వచ్చేసరికి వారి జీవితం వేదాంతంపై మళ్ళింది. ఆధ్యాత్మికంగా జీవితాన్ని మలుచుకున్నారు. సనాతన ధర్మం గురించీ, ఉపనిషత్తులను గూర్చీ అధ్యయనం చేయడమే గాకుండా అనేక ప్రవచనాలు చేసారు. ఎన్నో గ్రంథాలను రచించారు. కఠోపనిషత్తుపై ఆయన వ్రాసిన గ్రంథం ప్రామాణిక గ్రంథం; ఎంతో విశిష్టమైనది. సామాన్యులకా రచన సాధ్యం కాదు.

ఆత్మానుభూతి పొందడానికి రమణమహర్షి బోధించిన ఆత్మమూలాణ్వేషణం అద్భుతం అనేవారు. మిత మందికి ఆ అన్వేషణా సిద్ధాంతం అవగాహనమవుతుంది.

సామాన్యులకూ సహితమూ అవగాహనమయ్యేట్లు ఒక మార్గం చూపాలనేవారు. ఆయనెంతో ధర్మదృష్టి కలవారు. వారి సందేశమే అందకు తార్కాణం.

తాను ఈశ్వరుణ్ణి ప్రార్థించేది ఒక్కటే – నా అంతఃకరణంలో నేను పొందిన క్షేమం, తృప్తి, శాంతి ఈ మూడింటినీ ఈశ్వరుడు అందరికీ యివ్వాలి– అనేవారు. వారికి నమస్కరించినప్పుడు ఈశ్వరానుగ్రహ ప్రాప్తిరస్తు అనేవారు. దేశంలో సంక్షోభం, శాంతి, తృప్తి – ఈ మూడిటినీ ఈశ్వరుడు అందరికీ యివ్వాలి. మంచివారంతా సుఖపడాలి. అందరూ మంచివారు కావాలని కోరుకుంటాను. అందుకై భగవంతుణ్ణి ప్రార్థించడం తన కర్తవ్యం అంటారు. తృప్తి, అహింస, మత్సర రహితమైన సర్వభూతహితం, గొప్ప తపస్సు అనేవి అందరికీ సాధ్యమే! అదే అందరూ దేశమంతటా చేసినచో ఈశ్వర ప్రతిష్టాపనం అవుతుంది. ఎక్కడో ఆలయ ప్రతాష్టాపన కన్నా ఇది చాలా గొప్పది అన్నారీ సద్గురువరేణ్యులు.

ఆయన ఉద్యోగ విరామణానన్తరం భీమిలి శివార్ల తోటలోని ప్రశాన్త వాతావరణంలో, పచ్చని వృక్షాల మధ్య 'ఆనందవనం' అనే ఆశ్రమాన్ని నిర్మించారు. ఈ వనంలోనే అనేకమంది వృద్ధ దంపతులు నివసించడానికి ఇళ్ళు కట్టుకున్నారు. దేశంలో ఉన్న సంపద దక్షిణ కోస్తాలో కూడా సిద్ధింపచేయాలనీ శుభకల్పంగా మహలక్ష్మి ఆలయం నిర్మింపచేసారు. నిజంగా ఆ ఆలయదేవత ముమ్మూర్తులా మహలక్ష్మిలానే మూర్తీభవించినట్లుంటుంది.

కఠోపనిషత్తు విశ్లేషించిన మహన్మూర్తికి మృత్యువు వారి ఆధీనంలోనే ఉంటుంది. దీనికి తార్కాణంగా తన దేహత్యాగాన్ని (అవతారసమాప్తి) అనవచ్చు) ముందు తన కుమారుడు బసవరాజుకు చెప్పి 2015 జూన్ 10న వరంగల్‌లోని తన వనంలో దేహత్యాగం చేసారు. అక్కడే వారి సమాధి నిర్మించారు. 'గురుధామం' అని పేరు పెట్టారు.

ఆ సమయంలో వారికి అత్యంత ప్రియమైన శిష్యుడూ, మా శ్రేయస్సు కోరే మహనీయుడూ శాంతాబయోటిక్ అధినేత వరప్రసాదరెడ్డి అక్కడే ఉన్నట్లు చెప్పారు. ఆయన ఎంతటి అదృష్టవంతుడో– చివరి చూపు చూడగలిగారు.

చూడలేని నేను 'గురుర్బ్రహ్మ గురుర్విష్ణో, గురుర్దేవో మహేశ్వరా' అంటూ ఓ కన్నీటి బొట్టును విడిచాను.

## -మనసున్న గురుదేవులు-

**నా 75వ సంవత్సర విశేష సభకు కోరీ కోరగానే విచ్చేసారు. ఆశీర్వదించారు. మరుసటి రోజున మా యింటికి వచ్చి మా గృహం పావనం చేసారు. వారి పాదధూళితో మా గృహం పవిత్రమైంది!**



# తెలుగునేల వెలుగునేలగా తళతళలాడిందంటే తెలుగు తల్లిలోని కమ్మని తెలుగుదనమే!

తెలుగువారు అడుగిడిన చోట అమ్మ మంచినదమే కనిపిస్తుంది. అమ్మ మంచి దనమే సౌరభిస్తుంది. అమ్మ మంచితనమే గుభాళిస్తుంది. మనసు పొరల్లో మలికితనపు పొరలు లేవు. ఈర్ష్యలు లేవు. ఈశ్వరానుగ్రహం, ఈశ్వరి అవ్యాజపు ప్రేమ, వాత్సల్యమే పరిపూర్ణంగా ఉంటుంది. తెలుగువారున్న నేల తళతళలాడుతుంటుంది. మానవత, మమత, మహనీయతయను మూడు లక్షణాలూ ముమ్మూర్తులా తెలుగువానిలో ఉంటాయ్. ఒక్కసారి నెమరేయండి। - చేయెత్తి జై కొట్టు తెలుగోడా। గతమెంతో ఘనకీర్తిలవోడా।

ఏ దేశమేగినా, ఏ వూరు వెళ్ళినా మనసున మరుమల్లెల వాత్సల్య సౌరభాలను తెలుగువాడు విరబూయిస్తూనే ఉంటాడు.

బిళ్ళగోచీ పంచెకట్టడం వాడికే తెలుసు.

బిరుసుగా శిరః కేశములను దువ్వడం వాడికే తెలుసు.

మధ్య పాపిడిని ముచ్చటగా దువ్వడం తెలుగువాడికే తెలుసు!

సైడు పాపిడిని మధ్యపాపిడిని దిద్దుగోవడం వాడికే తెలుసు!

నూనూగు మీసాల నుంచీ మెలితిరిగే మీసం వరకూ దిద్దుకోగలగడం వాడికే తెలుసు!

మీసాలు దువ్వేది రోషం కోసం కాదు ; తల్లితండ్రులు బ్రతికున్నారని చెప్పడం కోసం మీసం సంకేతం!

ఒకకాలంలో ఫ్రెంచి మీసాలను పెట్టుకోవడం చూసాను.

ఓసారి నా మిత్రులతో బొజ్జెంకల్లా ఆ మీసాలేవిట్రాయని తీసేయించాను.

ఫ్రెంచిమీసాల పోలీసోడా ఎంచుకోరా నీదే దేశం- ఎంచుకోరా! నీదే దేశం! నాజూకైన మీసము పైన నాటులెన్నో వేసావేరా ? నీటు గోటూకానీ, నీవు నాగరికతను చంపుతావా ? హిట్లర్‌లా మెలుగుతావా ? అంటూ హేళన చేసి, కొందరి మిత్రులకు బోధించి తీయించేసాను. నా మిత్రులలో కొంతమంది అక్షరాలా అలానే చేసారు. కొంతకాలానికి ఆ అలవాటు అదృశ్యవాటయింది! కట్టూబట్టా మారింది! కానీ మనసులో పారే వాత్సల్యం మారలేదు. ఏ దేశం ఏగినా, ఎందుకాలిడినా పొగడరా నీ జాతి గౌరవం, నిలుపరా నీ జాతి తేజం. చేయెత్తి జై కొట్టర తెలుగోడా ! నీ జాతి గౌరవం నిలుపోర.

వీరరక్తపు ధార వారవోసిన సీమ! వెలనాడు నీదిరా! పలనాడు బాలచంద్రుడు చూడ ఎవరోడోయ్! తాంద్రపాపయగూడ నీవోడోయ్!

తెలుగునేల వెలుగునేలగా తళతళలాడింది. అమ్మఒడిని వెచ్చని ఒడిగా చేసిన చల్లని తల్లి తెలుగు తల్లి.

ఈర్ష్య లేని తల్లి. ఈర్ష్యలేని వొడి అమ్మవొడి. ఆంతర్యంలో అంతులేని ప్రేమగల తల్లి. మకిలిపట్టని మనసు, మమత, అమ్మదనపు కమ్మదనం అమ్మకే చెందుతుంది.

# కలకాలమూ జీవిత అడుగుజాడల్లో నిలిచే బి.యన్.రెడ్డి చిత్రం రంగులరాట్నం! ఇంతేరా ఈ జీవితం.



తిరిగే జీవిత రంగుల రాట్నం!

ఇంతేరా ఈ జీవితం తిరిగే రంగుల రాట్నం !

కొన్ని చిత్రాలు మన జీవితాలతో కలకలాడుతూ ఉంటాయ్.

కొన్ని పాటలు ఇలా వినిపించి అలా మాయమవుతుంటాయి. కొన్ని పాటలు మాత్రం కాలాతీతంగా కాలంతో పాటు నడుస్తాయి. పాటల్లోని తాత్వికత ఎప్పటికప్పుడు ఏదో ఒక కొత్త చూపును ఇస్తూనే ఉంటుంది.

బి.యన్.రెడ్డి దర్శకత్వంలో 1966లో వచ్చిన 'రంగుల రాట్నం' చిత్రం జాతీయ అవార్డు గెలుచుకుంది. ఈ సినిమాలో శ్రీరామవెంకట భుజంగరాయ శర్మ రాసిన 'కలిమి నిలవదు లేమి మిగలదు' పాట. సినిమాలో ఇది నేపథ్య గీతంగా వస్తుంది.

భారతదేశానికి పట్టుకొమ్మలైన పల్లెసీమలు. సిరిసంపదలు, పచ్చికబయళ్లతో కళకళలాడిన పల్లెలు. ప్రజలు ఒళ్ళు వంచి కష్టపడి ఉన్న దానితో సంతృప్తికరంగా జీవించిన కాలం'... ఈ పరిస్థితి మారిపోయి కష్టపడేవారు ఒక్కరై, ఖర్చుచేసేవారు పదిమందై, వసతులు తక్కువై, కష్టం ఎక్కువై, వ్యవసాయంపై ఆసక్తి తగ్గి, ఆస్తికి మించిన అప్పులు పెరిగాయి. సరిగ్గా ఇలాంటి కాలంలో... బాగా బతికి పల్లె నుంచి పట్నానికి వెళ్లిన ఒక కుటుంబ కథ ఈ చిత్రం.

ఈ పాట సినిమా కథలలో అంతర్లీనమైనట్టు కనిపించినా... లోకరీతిని స్పష్టంగా అక్షరాల్లో చెబుతుంది. బాగా బతికిన ఒక కుటుంబం, ఆతిథ్యానికి మారు పేరుగా నిలిచిన కుటుంబం అప్పుల పాలవుతుంది. ఆస్తులు హారతి కర్పూరంలా కరిగిపోతాయి.

'ఈ లోకంలో ఏది శాశ్వతం?' అనే ప్రశ్న ఈ పాట పల్లవిలో ఇలా ప్రతిధ్వనిస్తుంది...

**'కలిమి నిలవదు**
**లేమి మిగలదు**
**కలకాలం ఒక రీతి గడవదు!**
**నవ్విన కళ్లే చెమ్మగిల్లవా?**
**ఇంతేరా ఈ జీవితం**
**తిరిగే రంగుల రాట్నం'**

దారులు అనేకంగా కనిపిస్తాయి. అయితే వాటి గమ్యం ఒకటే. పేదవాళ్లుగా, ధనవంతులుగా మనుషులు రకరకాలుగా కనిపిస్తారు. అయినా అందరొకటే. పేదవాళ్లు అయినంత మాత్రాన... వారి నరాల్లో నెత్తురు బాగా ఉంది! కాబట్టి... ధనవంతుల నరాల్లో అమృతం ప్రవహించదు. గమ్యం చేరడానికి పేదవాడు తన రెండు కాళ్లను నమ్ముకున్నా, ధనవంతుడు ఖరీదైన కారుని నమ్ముకున్నా... చనిపోయాక ఇద్దరూ వెళ్లేది పాడె పైనే! ఈ సత్యం ఈ చరణాల్లో కనిపిస్తుంది.

'ఏనుగుపైన నవాబు
పల్లకిలోని షరాబు
గుర్రం మీద జనాబు
గాడిదపైన గరీబు
నడిచే దారుల గమ్యమొకటే
నడిపే వానికి అందరొకటే'

ఇద్దరు అన్నదమ్ములు సూర్యం, వాసు.

చిన్నోడు వాసు (చంద్రమోహన్) త్యాగం చేసి కష్టపడి పెద్దోడు సూర్యం (రామ్మోహన్)ని చదివిస్తాడు. పెద్దోడు లాయర్ అవుతాడు. ఒక పెద్దింటి అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాడు.

కొంతకాలానికే తాను నడిచొచ్చిన దారిని మరిచిపోతాడు. డబ్బున్న పెళ్ళాం ముందు... పేద తల్లి, పేద తమ్ముడు, పేద చెల్లి... మరింత పేదగా కనిపిస్తారు.

ఇక ఆయన శ్రీమతి గురించి అయితే చెప్పక్కర్లేదు. అత్త, మరుదులను ఆమె చీదరించుకుంటుంది. వాళ్లను దూరంగా పెట్టడమే నాగరికం అనుకుంటుంది.

అందుకే తమ్ముడు ఒక సందర్భంలో అన్నను ఉద్దేశించి ఇలా అంటాడు...

"సీతమ్మ కొడుకు కాదు... వనజ మొగుడు" ఈ పరిస్థితి చరణాల్లో ఇలా వ్యక్తం అవుతుంది...

'త్యాగం ఒకరిది
ఫలితం ఒకరిది
అమ్మ ప్రాణమా ఇద్దరిది
ఎదలు, బాధలు, కష్టగాథలు... చివరకు కంచికి వెళ్లే కథలే'

ఒకరి బాధ... ఇంకొకరి బాధ కాకపోవచ్చు. ఆ బాధ అవతలి వ్యక్తికి సంతోషం కూడా కలిగించవచ్చు. దీన్ని దృష్టిలో పెట్టుకునే కవి ఇలా అంటారు...

'ఇరుగింటిలోన ఖేదం
పొరుగింటిలోన ప్రమోదం'


ఎవరికి ఏదో అయిందని కాలం ఒక దగ్గర ఆగదు. తన కర్తవ్యాన్ని నిర్వర్తించకుండా దిగులుగా ఒక దగ్గర కూర్చోదు. ఈ వాస్తవం...

'ఎవరు కులికినా ఎవరు కుమిలినా
ఆగదు కాలం ఆగదు
జీవనవాహిని ఆగదు'

ఈ పాట విన్నప్పుడల్లా 'Life doesn't listen to your logic. It goes on its own way undisturbed' అనే ప్రసిద్ధ వాక్యం గుర్తుకొస్తుంది.

## శ్రీ జగద్గురు భారతీతీర్థ మహాస్వామి చరణుల ఉపదేశము

# జీవనపద్ధతి ద్వారా ఆత్మోద్ధరణ



మాతృగర్భంలో ఉన్నప్పుడు జీవునికి తన పూర్వ కర్మల జ్ఞానముంటుంది. అందువలన 'ఈసారి గర్భం నుండి బయటపడగానే ఎటువంటి దుష్కర్మల నాచరించను. ఎవరికీ చెడు చేయను, సత్కర్మల నాచరించి, సుకృతలాభాన్ని పొంది, అన్ని బంధనాల నుండి విముక్తిని పొంది సద్గతిని పొందుతాను. అప్పుడు భవసాగరంలో తిరిగి మునిగే అవసరముండదు" అని ఆలోచిస్తుంటాడట. అలా ఆలోచించే జీవుడు తల్లి గర్భం నుండి బయటపడగానే, తన సమస్త స్మరణశక్తిని పోగొట్టుకుని బాధపడ్తుంటాడు, ఏడుస్తాడు, అరుస్తాడు. ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉంటాడు. అసహాయస్థితిని అనుభవిస్తాడు. అలా ఎందుకు జరుగుతుంది? సాంసారిక మాయ జీవుని అటువంటి అయోమయస్థితిలో పడవేస్తుంది. తాను మాతృగర్భంలో ఉన్నప్పుడే ఏమేమి తాను ఆలోచించినదీ, ఇప్పుడేమయిందీ అతనికి గుర్తుండదు. మాతృమూర్తి యొక్క మమత, తండ్రి ప్రేమ, బంధుజనుల స్నేహం లభించగానే అవే సత్యమనుకొంటాడు. శాశ్వతమనుకొంటాడు. క్షణికమూ, అస్థిరమూ అయిన జీవితానికి సర్వాధిక మహత్తును ఆపాదిస్తాడు.

జీవుడు నానా యోనులలో అనేక జన్మలెత్తి ఈశ్వరానుగ్రహం మరియు పుణ్యవిశేషంతో మానవ జన్మను పొందుతాడు. మనుష్య జన్మనెత్తిన పిదప జాగృతం కానంతవరకు జీవితం సార్థకత నొందదు. మనస్సు ప్రబోధితమైనప్పుడు తన జీవిత లక్ష్యాన్ని గ్రహిస్తాడు.

**మహతా పుణ్యపణ్యేన క్రీతేయం కాయనౌస్త్వయా।**
**పారం దుఃఖోదధోర్గన్తుం తర యావన్న భిద్యతే॥**

అతని మనస్సు అతనికి జ్ఞాపకం చేస్తుంటుంది. "ఎంతో విలువైన పుణ్యాన్ని చెల్లించి నీవు ఈ శరీరమనే నావను కొన్నావు. ఎందుకోసం? దుఃఖరూప సాగరాన్ని దాటటానికి. ఈ నావ నశించక మునుపే ఆ సాగరాన్ని దాటాలి"

ఈ సృష్టియొక్క సుందరమైన అతి సుందరమైన పుష్పం మనుష్యుడు. ఈ విషయం గ్రహిస్తే జీవిత సమస్యలన్నీ పరిష్కారమవుతాయి. వాస్తవమైన సుఖం లభ్యమవుతుంది. శ్రీశంకర భగవత్పాదులు వివేక చూడామణిలో ఇలా వ్రాసారు.

**దుర్లభం త్రయమేవైతద్దైవానుగ్రహ హేతుకమ్ ।**
**మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుససంశ్రయః ॥**

మనుష్యత్వం అంటే మనుష్య జన్మ, మోక్షంపై కోరిక, మరియు సత్పురుషుల సంపర్కం ఈ మూడు కూడా ఎంతో కష్టపడితేకాని లభించవు. భగవంతుడి అనుగ్రహంతోనే లభిస్తాయి.

భగవంతుడి అనుగ్రహం లేకపోతే పైన పేర్కొన్న మూడింట్లో ఏ ఒక్కటి కూడా లభించదని చెప్పవచ్చు. శ్రీశంకర భగవత్పాదులు తైత్తిరీయోపనిషత్తు భాష్యంలో శ్రుతి వాక్యాన్ని ఉదహరిస్తూ ఇలా వ్రాసారు. **"పురుషే త్వేవ్వావిస్తరామత్మా స హి ప్రజ్ఞానేన సమ్పన్నతమో విజ్ఞాతం వదతి విజ్ఞాతం పశ్యతి వేద శ్వస్తనం వేద లోకాలోకౌ మర్త్యేనామృతమీక్షతీత్యేవం సమ్పన్నః। అథేతరేషాం పశూనామశనా యాపిపాసే ఏవాభివిజ్ఞానమ్।"** పురుషులలోనే (అంటే మానవులలో) ఆత్మ పూర్ణ రూపంలో విస్తారంగా ఉన్నది. ఉత్కృష్టజ్ఞానం కలగటానికి మార్గం వారికి తెలుసు. అలా తెలిసి వారు మాట్లాడుతారు. ఏది తెలుసో, దానినే చూస్తాడు. రేపు జరిగే అంటే భవిష్యత్ విషయాలు వారికి తెలుసు. ఇహపరలోకాల జ్ఞానం వారికున్నది. మర్త్యం అంటే నాశనమయ్యే సాధనాలతో యుక్తుడైనా విశుద్ధ ఆచరణ, అనుష్ఠానం, మరియు జ్ఞానంతో దివ్యత్వాన్ని, అంటే అమరత్వాన్ని పొందాలనెడి అభిలాష కలిగియుంటారు. అలా అతడు వివేక సంపన్నుడు. అన్యజీవులలో పక్షపక్ష్యాదులలో ఆకలి దప్పికలను తీర్చుకోవాలనెడి తెలివి మాత్రమే ఉంటుంది.

సకల చరాచర సృష్టిలో మానవుడు అత్యంత మహత్త్వపూర్ణ ప్రాణి అని స్పష్టమవుతోంది. మనుష్యుడు అత్యంత చతురుడు, వివేకశీలి, ప్రజ్ఞావంతుడు, దూరదర్శి, బుద్ధిమంతుడు, ఆకాశంలో అంతరిక్షంలో చాలా దూరం వరకు ప్రయాణించగలడు. ఎంతెంతో ఎత్తు ఎగరగల వాహనాలను రూపొందించి అచ్చటి రహస్యాలను తెలుసుకోవటానికి ప్రయత్నం చేయగలడు. సముద్రపు లోతులలోకి వెళ్లి అచ్చటి జలచరాల రూపం గురించి, తెలిసికొనటంతోపాటు, నూతన యంత్రాలను కనిపెట్టి, సముద్రంలోని మార్పులను, తుఫానుల గురించి తెలుసుకొని వాటి నుండి తనను తాను కాపాడుకొనటానికి ఆలోచించగలడు. విజ్ఞానం పేరుతో చేసే ఆవిష్కరణలన్నీ మానవుని బౌద్ధిక శక్తి యొక్క విశేషతా పరిణామమే. నాగరిక సమాజంలోని వ్యక్తి మాత్రమే కాదు. సామాన్యులు, గిరిజనులు, కూడా తాము అన్ని ప్రాణులకంటే, జీవులకంటే సర్వశ్రేష్ఠులమని భావిస్తుంటాడు. అటువంటి స్థితిలో అతడి జీవిత లక్ష్యం ఏమై ఉండాలి? 'తినటం, త్రాగటం, సుఖించటం, ఇదే జీవితమా? ఇదే లక్ష్యమా?"

**ఆహారనిద్రా భయమైథునం చ సామాన్యమే తత్పశుభిర్నరాణామ్ ॥**


ఇంతమాత్రమే జీవితలక్ష్యమైనట్లయితే పశువులకు మనుష్యులకు తేడా ఏమిటి? జన్మించటం మరణించటం మాత్రమే జీవితం కాదు. దాని విశ్లేషణ ఏమిటి? **మహాజనోయేన గతః స పన్థాః** మహాత్ములు, సత్పురుషులు, అనుభవవేద్యులైన సాధకులు, జీవిత రహస్యాన్ని గ్రహించిన తత్త్వజ్ఞులు ఏ మార్గాన్ని అవలంభించారో, ఇతరులకు ఏ మార్గాన్ని అవలంభించవచ్చని చెప్పారో, ఆ మార్గాన్ని అవలంభిస్తే

మన జటిల సమస్యలు దూరమవటమే కాదు, దృఢమైన భావనలుంటాయి. మనస్సులో దృఢత, సంశయహీనత ఏర్పడుతాయి. అందువలన మన జీవన క్రమం పవిత్రంగా నిర్మలంగా ఉండాలి.

దేశకాలాదులు జీవన క్రమాన్ని తెలుసుకొనటానికి ఆధారభూతమవుతాయి. అన్ని దేశాల జన జీవన స్థితిగతులు సమానం కాదు. సూక్ష్మంగా ఆలోచిస్తే చాలా తేడాలుంటాయి. అయితే సామాన్యంగా ఆలోచిస్తే సమానత, సారూప్యత గోచరిస్తాయి. మనం ఇక్కడి ప్రజల జీవనక్రమంపై విశేష దృష్టితో పరికిస్తే ఇచ్చటి ప్రాచీన పరంపర, సాంస్కృతిక భవ్యత కారణంగా జీవన క్రమంలో ఏకరూపం దృగ్గోచరమవుతుంది. తన ఉద్ధరణను, ప్రగతిని కోరుకోని వారెవరుంటారు. స్వచ్ఛమైన,స్వస్థ జీవితంలో ఇహపరలోక ప్రగతి మరియు సఫలత, శ్రేయస్సు లభించే అవకాశమున్నది. మంచి ఆలోచనలు, మంచి ఆచరణ మొదలైన వాటిచే మనం దుఃఖశోకాది బంధనాల నుండి ముక్తులమై లక్ష్యాన్ని చేరుకోగలం. మంచి ఆలోచనలు దేశకాలాతీతం. పరోపకారం చేయాలి. ఇది సర్వమానవాళికి సమానమైన సూత్రం. ఇది మా దేశానికి తగినదేకాని, ఇతర దేశాలకు మంచిది కాదు అని ఎవరూ చెప్పలేరు. అదే సత్యాన్ని పలకటం విషయం కూడ. అసత్యాన్ని పలకండి అని ఎవరూ చెప్పరు. ఎందువలననగా దీనివలన అందరికీ హాని కలుగుతుంది. వాస్తవానికి సత్యం పలకటం ఒక తపస్సు. కబీరుదాసు ఇలా అన్నాడు :

**సాంచ్ బరాబర్ తప్ నహీ ఝూఠ్ బరాబర్ పాప్।**
**జాకే హిరదయ్ సాంచ్‌హై, తాకే హిరదయ్ ఆప్ ॥**

క్రోధ, త్యాగం, దమం, శమం మొదలగువాని ఆలోచనలు ఈ విధమైనవే. జీవన క్రమం అప్పుడే పవిత్రంగా ఉంటుంది. వ్యక్తియొక్క ఉద్ధరణ జరుగుతుంది.



శ్రీసూర్య భగవానుని ప్రభావం ప్రతాపతాపమే కాదు

**ఓం చిత్రం దేవానముదగాదనీకం చక్షుర్మిత్రస్య వరుణ స్యాగ్నేః।**
**అప్రా ద్యావాపృథివీ అన్తరిక్షం సూర్య ఆత్మా జగతస్తస్థుషశ్చ ॥**
(ఋగ్వేదం1-115-1)

పై మంత్రద్రష్ట అయిన ఋషి సూర్యుని మహిమను వర్ణిస్తూ చివరికి యిలా ముగించాడు : "తేజోమయమైన సూర్యుని కిరణ పుంజాలు మిత్ర, వరుణ అగ్ని మొదలగు దేవతలకు, విశ్వంలోని సమస్త ప్రాణులకు నేత్రాలు. స్థావర జంగమాత్మకమైన సమస్త జీవులకు అన్తర్యామి అయిన ఆత్మ, సూర్యభగవానుడు తన ప్రకాశంతో ఆకాశం, పృథివీ మరియు అంతరిక్ష లోకాలకు సంపూర్ణత్వాన్ని కలుగజేస్తూ తాను ఉదయిస్తాడు"

వశిష్ట మహర్షి సూర్యుని స్తుతిస్తూ ఇలా అన్నాడు: "జ్ఞానుల అంతరాత్మ, జగత్తుకు ప్రకాశింపజేయువాడు. ఈ ప్రపంచం యొక్క హితైషి, స్వయంభువు, సహస్ర కిరణాలనబడే వెలుగొందే నేత్రాలతో సుశోభితుడై వెలుగొందుచున్నాడు. మహాతేజస్వి, సురశ్రేష్ఠుడయిన సూర్యభగవానునికి నమస్కారాలు".

**వివస్వతే జ్ఞానభృదన్తరాత్మనే జగత్ప్రదీపాయ జగద్ధితైషిణే।**
**స్వయంభువే దీప్త సహస్ర చక్షుషే సురోత్తమాయామి తతేజసే నమః ।**
(మహాభారతం ఆది 172-18)

సూర్యనారాయణుడు ప్రత్యక్షదేవత. ప్రకాశరూపుడు. ఉపనిషత్తులలో సూర్య భగవానుని మూడు రూపాల గురించి చెప్పబడింది. 1. నిర్గుణ నిరాకారం, 2. సగుణ నిరాకారం 3. సగుణసాకారం. 'ఆదిత్యం బ్రహ్మేతి'.

చాక్షుషోపనిషత్తులో సాంకృతముని ఆదిత్యలోకానికి వెళ్ళి సూర్యభగవానుని నుండి చాక్షుస్మతీ విద్యను సంపాదించినట్లుగా ఉన్నది. అలాగే ఋషి శ్రేష్ఠుడైన యాజ్ఞవల్క్య మహర్షి ఆదిత్య లోకానికి వెళ్ళి, సూర్య భగవానుని దర్శించి ఆత్మతత్త్వం గురించి ఉపదేశం పొందాడు. హనుమంతుడు కూడ సూర్యుని ఆత్మజ్ఞానం పొందినట్లు ఉపదేశం పొందాడు. హనుమంతుడు కూడా సూర్యుని నుండి ఆత్మజ్ఞానం పొందినట్లు ప్రసిద్ధ ఐతిహ్యం ప్రచారంలో ఉన్నది. సూర్యభగవానుడు స్వయంగా పరమాత్మయే! భక్తుల కోసం సగుణసాకార రూపాన్ని ధరించాడు. వివిధ విద్యలను ఉపదేశిస్తాడు. గ్రహాధిపతిగా ప్రతిష్ఠితుడై జ్యోతిష చక్రాన్ని నియంత్రిస్తుంటాడు.

విష్ణువు యొక్క స్థానం వైకుంఠం, శివుని స్థానం కైలాసం అయినట్లు, బ్రహ్మస్థానం బ్రహ్మలోకమయినట్లు, జగన్మాత స్థానం మణిద్వీపమయినట్లు, సూర్యనారాయణుని స్థానం ఆదిత్య లోకం- సూర్యమండలం అని చెప్పవచ్చు. సూర్య భగవానుడే కాలచక్ర నిర్మాత, సూర్యుని ద్వారానే దినరాత్రాలు, వారాలు, పక్షాలు, నెలలు, ఋతువులు, అయనాలు, సంవత్సరాలు, ఘడియలు, విఘడియలు మొదలైనవి ఏర్పడుతున్నాయి. సంపూర్ణ జగత్తుకు వెలుగునిచ్చేది ఆయనే. సూర్యుడే జీవనం, తేజస్సు, ఓజస్సు, బలం, యశస్సు, చక్షువులు, శ్రోత్ర, ఆత్మ మనస్సు **"ఆదిత్యో వై తేజ ఓజో బలం యశశ్చక్షుః శ్రోత్రే ఆత్మామనః"** (నారాయణోపనిషత్తు 15)

సూర్యనారాయణ ఆవిర్భావం గురించి ఇలా చెప్పబడింది. విష్ణుమూర్తి యొక్క నాభి కమలం నుండి బ్రహ్మ జన్మించాడు. బ్రహ్మ మానసపుత్రుడు మరీచి. మహర్షి మరీచుని పుత్రుడు కశ్యపుడు. ఆ కశ్యపుడే సూర్యుని తండ్రి, సూర్యుని తల్లి అదితి. ఆమె దక్షప్రజాపతి కుమార్తె. కాబట్టి అదితినందనుడని మరీచి పౌత్రుడని చెప్పబడుచున్నాడు.

సూర్యభగవానుడు అన్ని గ్రహాలకు రాజు. ఇంటి మధ్యలో పెట్టిన దీపం ఇంటికంతటికీ వెలుగును ప్రసరించినట్లు అఖిల జగత్తుకు అధిపతి అయిన సూర్యభగవానుడు తన సహస్రకిరణాలతో సమస్త లోకాలకు వెలుగును అందజేస్తాయి. పరమదివ్యతేజః పుంజమే సూర్యుని స్వరూపము. సూర్యుని తేజోమండలము రెండు విభాగాలుగా విభజించబడింది. ఒక భాగంలో సూర్యతేజస్సు ఊర్ధ్వగామియై ప్రకాశిస్తుంటుంది. ఆ తేజస్సు శక్తి సంజ్ఞ. రెండవభాగం అధోగామియై పృథివినుండి పాతాళం వరకు ప్రకాశ వంతం చేస్తుంది. ఆశక్తియొక్క పేరు ఛాయ. పురాణాలలో సంజ్ఞాఛాయలను సూర్యుని పత్నులుగా పేర్కొ న్నారు. వాళ్లిద్దరు సూర్యుని శక్తిరూపంలో నిరంతరం గతిశీలురై ఉంటారు.

సూర్యలోకంలో సూర్యుని సమక్షంలో ఇంద్రాది దేవతలు, ఋషులు కూర్చొని ఉండగా గంధర్వ, అప్స రసలు, నృత్యగానాదులతో సూర్యుని స్తుతిస్తుంటారు. త్రిసంధ్యాకాలంలో మూర్తిమంతుడై ఆయన ఉపస్థితుడై యుంటాడు. ఏడు ఛందో మయగుఱ్ఱాలు ఆయనకున్నాయి. అందుకనే ఆయనను సప్తాశ్వతిలకు డంటారు. ఘడియ, విఘడియ ఋతువు సంవత్సరాది కాలరూపాలు అవయవాలుగా నిర్మించ బడిన దివ్యరథంపై సూర్యనారాయణుడు సుశోభితుడై యుంటాడు. గరుత్మంతుని అనుజుడైన అరుణుడు ఆయన సారథి. ఆయన రెండు వైపుల- కుడివైపు రాణి సంజ్ఞా, ఎడమవైపు రాణి ఛాయ రాణులుంటారు. ఆయనతోపాటు పింగళుడనే పేరుగల లేఖకుడు, దండనాయకుడనే పేరుగల ద్వారపాలకుడు, కల్మాషులు అనే పేరుగల పక్షులు ద్వారం వద్ద ఉంటారు. దిండి ఆయన ముఖ్య సేవకుడు. ఎప్పుడూ ముందు నిలబడి ఉంటాడు.

సూర్యునికి పదిమంది సంతానం. విశ్వకర్మ పుత్రికైన సంజ్ఞ ద్వారా వైవస్వత మనువు, యముడు, యమీ (యమున) ఇద్దరు అశ్వనీకుమారులు మరియు రేవంత్ జన్మించారు. ఛాయద్వారా శని, తపతీ, విష్టి (భద్రా) సావర్ణీ మనువు జన్మించారు.

సూర్యుని కుటుంబం గురించి పురాణాలలో చాలా విస్తారంగానే ఉన్నది. దాని సారాంశం తెలుసుకుందాం.

విశ్వకర్మ (త్వష్టా) కూతురైన సంజ్ఞా! (త్వాష్ట్రీ)తో వివాహమై ముగ్గురు పిల్లలు. వైవస్వత మనువు, యమీ, జన్మించిన పిదప సూర్యుని తేజస్సును భరించలేక తన రూపాకృతులుగల ఛాయను అక్కడ స్థాపించి తన తండ్రి గృహమైన 'ఉత్తరకురు'కు వెళ్ళి, చాటుగా, అశ్వరూపం ధరించి శక్తి వృద్ధికై కఠోర తపమాచరించసాగింది. సూర్యుడు ఛాయను తనపత్నిగా భావించి ఆమె సంసారం చేయగా ఆమెకు వరుసగా సావర్ణి మనువు, శని, తపతీ మరియు విష్టి (భద్రా) జన్మించారు. ఆ నలుగురిని ఛాయ అమితంగా ప్రేమిస్తూ సంజ్ఞయొక్క సంతానమైన వైవస్వత మనువును, యమ, యమీలను పట్టించుకునేది కాదు.

ఛాయ తమ పట్ల ప్రదర్శిస్తున్న తిరస్కార భావానికి దుఃఖితుడైన యముడు తన తండ్రి సూర్యునితో ఇలా అన్నాడు : "తండ్రీ ఛాయ మా తల్లి కాకపోవచ్చు. ఎందుకనగా మమ్మల్ని నిర్లక్ష్యం చేస్తోంది. కొడుతుంది. సావర్ణి మనువాదులను ఎక్కువగా ప్రేమిస్తుంది. నాకు శాపం కూడా ఇచ్చింది. పిల్లలు ఎంత కష్టపెట్టినా ఏ తల్లీ తన సంతానానికి శాపమివ్వదు". యముని మాటలు విన్న సూర్యుడు కోపంతో అలా ప్రవర్తించటానికి కారణమేమిటని ఛాయను. "నిజంగా చెప్పు. నీవెవ్వరవు?" అన్నాడు సూర్యుడు. ఆ మాటలకు భయకంపితురాలైన ఛాయ తాను సంజ్ఞను కాననీ, ఆమె యొక్క ఛాయను మాత్రమేననెడి రహస్యాన్ని వెల్లడించింది. ●

# 32 యుగాలలో సామాన్యులు చేయని వేదనిధిని ఆదిశంకర భగవత్పాదులు 32 సంవత్సరాలలోనే అందించారు



**32** యుగాలలో సామాన్యులు చేయలేని పనిని శ్రీ ఆదిశంకరాచార్యులు 32 సంవత్సరాలలో సాధించారు. అంతటి మహత్తర సేవను చేసినా ఆయన తానేమీ కోరలేదు. ఆయన విజయాలను వివరించే శ్లోకం.

**అష్టవర్షే చతుర్వేదీ ద్వాదశే సర్వశాస్త్రవిత్**
**షోడశే కృతవాన్ భాష్యం ద్వాత్రించే మునిరభ్యగాత్॥**

ఎనిమిది సంవత్సరాల వయస్సులో నాలుగు వేదాల అధ్యయనం పూర్తి చేశారు. పన్నెండు సంవత్సరాల వయస్సు వచ్చేనాటికి అన్నిశాస్త్రాలలో పాండిత్యాన్ని సాధించారు. పదహారు సంవత్సరాలకు అన్ని భాష్యాలను పూర్తి చేశారు. ముప్పది రెండు సంవత్సరాలకు తన అవతార లక్ష్యాన్ని నెరవేర్చారు. కైలాసానికి తిరిగి చేరుకున్నారు. పరమేశ్వరుడు తన ఆదిశంకరాచార్య అవతారంలో తన అవతార లక్ష్యసాధనకు అవసరమైన సమయాన్ని భూమి మీద గడిపి తిరిగి కైలాసానికి చేరుకున్నారు. అవసరమైన దానికంటే క్షణం ఎక్కువగాని, తక్కువగాని గడపలేదు అన్నారు శృంగేరి శ్రీసన్నిధానంవారు శ్రీశ్రీ విదుశేఖర భారతీ స్వామి వారు. శ్రీఆదిశంకారాచార్య ధర్మాన్ని రక్షించారు. నాలుగు మఠాలను ఏర్పరచి, ఆ మఠాలలో తన నలుగురు శిష్యులను పీఠాధి పతులుగా నియమించారు ధర్మరక్షణ, బాధ్యతలను అప్పగించారు. ఆ నాలుగు పీఠాలలో దక్షిణామ్నాయ శ్రీశారదాపీఠం, శృంగేరి, శ్రీఆది శంకారాచార్యుల కాలం నుండి నేటి వరకూ సంప్రదాయాన్ని పూర్వమువలెనే పాటిస్తూ వస్తున్నది.

శృంగేరీ శారదాపీఠం గురుపరంపరలో మహాత్ములందరూ, శ్రీ ఆదిశంకరాచార్యులవలె ధర్మాన్ని రక్షించినవారు. శ్రీశారదాపీఠ 32వ పీఠాధిపతులు జగద్గురు శ్రీవృద్ధ నరసింహ భారతీ మహాస్వాములవారు ధర్మరక్షణలో చాలా కష్టపడ్డారు. ఆయన సన్యాస దీక్షను స్వీకరించిన అయిదు రోజులకే ఆయన గురువు విదేహముక్తిని పొందారు. ఎన్నో కష్టాలు ఎదురైనా శ్రీవృద్ధ నరసింహ భారతీ మహాస్వామివారు ధర్మరక్షణలో స్థిరంగా నిలబడ్డారు. ఆయన శిష్యులు జగద్గురు శ్రీసచ్చిదానంద శివాభినవ నరసింహ భారతీ మహాస్వాములవారు ధర్మరక్షణకై విశేషంగా కృషి చేశారు. తమ శిష్యులైన జగద్గురు శ్రీచంద్రశేఖర భారతీ మహాస్వాములవారు ధర్మాన్ని ఆచరించారు. రక్షించారు. శిష్యులకు ధర్మాన్ని బోధించారు. తత్ఫలితంగా అనేకమంది శిష్యులు ధర్మమార్గంలోనే ప్రవర్తించారు. 'జీవన్ముక్తులు' అనే ఒక్కపదం చాలు అటువంటి మహాత్ములు వర్ణించటానికి. ఆ మహాత్ములను దర్శించటానికి కూడా పుణ్యం చేసికొని ఉండాలి. అట్టి మహాత్ములు అలంకరించినది ఈ దక్షిణామ్నాయ శ్రీశారదాపీఠం. జగద్గురు శ్రీచంద్రశేఖర భారతి మహాస్వాములవారి శిష్యులు జగద్గురు శ్రీఅభినవ విద్యాతీర్థ మహాస్వామివారు. ఆయన దేశమంతటా పలు మార్లు పర్యటించి ప్రజలలో ధార్మిక చైతన్యాన్ని జాగృతం చేశారు. తమ గురువుగారు, జగద్గురు శ్రీమదభినవ విద్యాతీర్థ మహాస్వాములవారి శిష్యులు అయిన జగద్గురు శ్రీభారతీతీర్థ మహాస్వాములవారు శ్రీఆదిశంకరాచార్యులు తదనంతర గురుపరంపర చూపిన మార్గాన్నే అనుసరిస్తున్నారు అని చెప్తూ తాము వారి శిష్యులు కావటం తమ అదృష్టమని అందువలన తమకు ధన్యాత్మ భావన కలుగుతోందని శ్రీసన్నిధానంవారు అన్నారు.



శ్రీశ్రీశ్రీ విదుశేఖర భారతీస్వామివారు

తమ వర్థంతినాడు బహు ప్రాంతాల నుండి వచ్చిన శిష్యులను చూసి తమకు సంతోషంగా ఉన్నదనీ శ్రీశారదాపీఠానికి చెందిన గురుపరంపర యున్నట్లే శిష్యపరంపర ఉన్నదనీ, తమ గురువుగారి పట్ల, తమపట్ల కూడా భక్తి ప్రపత్తులను ప్రదర్శిస్తున్న శిష్యపరంపరను చూసి తమకానందదాయకంగా ఉన్నదన్నారు శ్రీసన్నిధానం. ఈ సంప్రదాయాన్ని కొనసాగించాలని చెప్తూ జగద్గురు శ్రీవిధుశేఖర భారతి స్వామివారు శిష్యులకు ఆశీస్సులనందజేశారు.

(శ్రీశంకరకృపకు కృతజ్ఞతలు)

## ఆంధ్ర విద్యార్థుల అపూర్వ సాహసం! కిలీ మంజారోపై ఎగిరిన తెలుగు పతాకం!! పర్వతాన్ని అధిరోహించిన తెలుగు విద్యార్థులు



**ఆ**ఫ్రికా దేశం టాంజానియాలోని కిలిమంజారో పర్వత శిఖరంపై తెలుగు కీర్తి రెపరెపలాడింది. తెలంగాణా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని 14 మంది విద్యార్థులు బృందమై క్లిష్టమైన ఈ పర్వతాన్ని అధిరోహించింది. స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని 20 అడుగుల జాతీయ జెండాను పర్వతంపై ఎగురవేసారని మెదక్ జిల్లా కలెక్టర్ రొనాల్డ్ రోస్ చెప్పారు. దీంతో పాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటం, పూర్ణపై నిర్మించిన చిత్రం పోస్టర్‌ను అక్కడ విడుదల చేశారు. వీరిలో కొల్పారం కేజీబీవీకి చెందిన గమని నర్సమ్మ (12) పిన్నవయస్కురాలు. ఈ ఫీట్‌తో కిలిమంజారో ఎక్కిన అతి చిన్న వయస్కుల బృందంగా ప్రపంచ రికార్డు సృష్టించింది. పిన్న వయసులోనే ఎవరెస్టు ఎక్కి రికార్డు నెలకొల్పిన స్వేరోస్ విద్యార్థిని మలావత్ పూర్ణ, పర్వతారోహకులురాలు రాజి తమ్మినేని, ట్రాన్సెండ్ అడ్వంచెర్స్ సంస్థ నిర్వాహకుడు బూచినపల్లి శేఖర్‌బాబు నేతృత్వంలో ఈ నవంబర్ 8న హైదరాబాద్ నుంచి 18మంది విద్యార్థుల బృందం బయలుదేరింది. దాదాపు రూ. 60 లక్షల ఖర్చుతో చేపట్టిన అత్యంత కఠినమైన కిలిమంజారో అధిరోహణలో బృందంలోని 14మంది విజయవంతమయ్యారు. వీరంతా రాష్ట్రంలోని కస్తూర్బా గాంధీ, గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యార్థులు. సముద్రమట్టానికి 19,340 అడుగుల ఎత్తులో, అత్యంత ప్రమాదకరమైన ప్రతికూల వాతావరణ పరిస్థితులతో ఉండే ఈ పర్వతారోహణను నవంబర్ నెల 10న ప్రారంభించిన విద్యార్థులు ఆదివారం పూర్తి చేశారు. సోమవారం సాయంత్రం కిందికి దిగుతామని ప్రకటించి దిగారు.